
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 11 జూలై 2025

వయసు పెంచి.. పెన్షన్ కాజేసి...

- విద్యుత్ శాఖలో రూ.70 లక్షల మేర అక్రమాలు
- రికవరీకి సన్నాహాలు
- ఫ్యామిలీ పెన్షన్‌లో గోల్‌మాల్..! ● ఇంటిదొంగలే సూత్రధారులు..

మదనపల్లె, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పనిచేస్తూ పదవీ విరమణ అనంతరం మృతి చెందిన కుటుంబాలకు ఇచ్చే ఫ్యామిలీ పెన్షన్ మంజూరులో గోల్‌మాల్ జరిగింది. చనిపోయిన ఉద్యోగికి సంబంధించిన పెన్షన్ తీసుకునేవారికి 70 ఏళ్లు వచ్చిన తర్వాతే క్వాంటమ్ పెన్షన్, అరియర్స్ తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. అయితే విద్యుత్ శాఖలో కొందరు అక్రమార్కులు తక్కువ వయస్సు ఉన్న వారికి క్వాంటమ్ పెన్షన్ ఇచ్చేసి వారి నుంచి మామూళ్లు వసూలు చేశారు. రూ.70 లక్షల మేర అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ విషయం విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిని సీరియస్‌గా తీసుకున్న ఆ శాఖ ఉన్నతాధికారులు రికవరీకి సన్నాహాలు చేస్తున్నారు. తర్వాత మంజూరు చేసిన ఫైళ్లను మరోసారి పరిశీలిస్తే రూ.కోటి వరకు ఉంటుందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి బాధ్యులు మీరంటే మీరంటూ ఒకరిపై మరొకరు వేసుకుంటున్నారు.





విద్యుత్ సబ్‌స్టేషన్

AP TRANSCO

క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ విధానం

70 ఏళ్లు నిండిన వారికి 7 శాతం
75 ఏళ్లు నిండిన వారికి 12 శాతం
80 ఏళ్లు నిండిన వారికి 20 శాతం
85 ఏళ్లు నిండిన వారికి 25 శాతం

అలాగే 90 ఏళ్లు, 95 ఏళ్లు, వందేళ్లు నిండిన వారికి వరుసగా 30 శాతం, 35 శాతం, 50 శాతం బేసిక్‌పై పొందవచ్చని రాష్ట్ర ప్రభుత్వం 2022 ఫిబ్రవరి 2వ తేదీ జీవో నెంబర్-30 జారీ చేయగా, తర్వాత 2022 మార్చి 16వ తేదీ డిస్కం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే అదునుగా ఫ్యామిలీ పెన్షన్ మంజూరు విధానంలో సంబంధిత ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించారు. ఇలా అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ వ్యవహారం నడిచిందని చెబుతున్నారు.

క్వాంటమ్ పెన్షన్ అంటే...

ఉద్యోగికి సంబంధించిన ఫ్యామిలీలో పెన్షన్ తీసుకునే వారికి 70 సంవత్సరాలు పైబడితే.. ప్రతి ఐదేళ్లకోసారి వయస్సును బట్టి పెంచుతూ ఇచ్చే విధానాన్ని క్వాంటమ్ పెన్షన్ అంటారు. గతంలో టీడీపీ ప్రభుత్వం 70 ఏళ్లు పైబడిన వారికి ప్రథమంగా 10 శాతం ఇవ్వగా తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దానిని 7 శాతానికి తగ్గించింది.

డివిజన్ విద్యుత్ శాఖ పరిధిలో రిటైర్ అయిన తర్వాత ఫ్యామిలీ పెన్షన్ తీసుకునే లబ్ధిదారులు దాదాపు 500 మంది ఉన్నారు. వీరిలో ఫ్యామిలీ పెన్షన్‌దారులు 250 మంది వరకు ఉన్నట్లు చెబుతున్నారు. వీరిలో చాలామందికి క్వాంటమ్ పెన్షన్ పొందే విధానం తెలియదని చెబుతున్నారు. అయితే విద్యుత్ శాఖలో ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు చూసే విభాగంలో కొందరు ఉద్యోగులు క్వాంటమ్ పెన్షన్ అదనపు లబ్ధికి తెరలేపారు. సాధారణంగా లబ్ధిదారులకు 70 ఏళ్ల నుంచి రెగ్యులర్ ఫ్యామిలీ క్వాంటమ్ పెన్షన్, అరియర్స్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఫ్యామిలీ పెన్షన్లకు మరణించిన పెన్షనర్‌దారుడి వయసును లెక్కించి ఇచ్చేశారు. తక్కువ వయసు ఉన్నవారికి కూడా రెగ్యులర్ ఫ్యామిలీ పెన్షన్‌తో పాటు క్వాంటమ్ అరియర్స్ కూడా లెక్కించి మంజూరు చేశారు. ఇలా అదనపు సొమ్ము నుంచి కమీషన్లు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఒక్కొక్కరు రూ.40 వేల నుంచి రూ.70 వేల వరకు అదనపు లబ్ధి పొందినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే వీరికి రావాల్సింది..కొంతే అయినా..వయస్సును పెంచడం ద్వారా వారికి వచ్చే సొమ్మును కూడా పెంచి ఇచ్చేశారు. పెన్షన్ మంజూరు చేసే విభాగంలోని కొందరు ఉద్యోగులు మూడేళ్లుగా అక్రమాలకు తెరలేపినట్లు చెబుతున్నారు. ఉదాహరణకు ఒక పెన్షన్‌దారుడు 50 ఏళ్లలో చనిపోతే, భార్య లేదా వారసులకు సుమారు సగం వరకు ఫ్యామిలీ పెన్షన్ వస్తుంది. అయితే 2022 నాటి జీవో ప్రకారం క్వాంటమ్ పెన్షన్ మంజూరులో భాగంగా వయస్సును కూడా పెంచి అదనపు లబ్ధి చేకూర్చారు. ఇలా అదనంగా మంజూరు చేసిన సొమ్ములో కొందరు ఉద్యోగులకు కొంత సొమ్ము ఇచ్చేలా ఒప్పందం మేరకు గోల్‌మాల్ వ్యవహారం నడిచినట్లు తెలిసింది. ఇలా పెన్షన్‌దారుల్లో వందమందికి మించీ రూ.70 లక్షల మేర ప్రభుత్వ ఖజానాకు గండి పడింది. పెన్షన్ మంజూరులో భాగంగా మరికొన్ని ఫైళ్లు సంతకానికి ఉన్నతాధికారి వద్దకు వెళ్లడంతో విషయం వెలుగులోకి వచ్చినట్లు చెబుతున్నారు. అనంతరం పెన్షన్ లెక్కలను పరిశీలించిన అధికారులు అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. అయితే ఈ విషయం బయటకు పొక్కక ముందే సర్దుబాటు చేయాలని, లేకుంటే లబ్ధిదారుల నుంచి రికవరీ చేయాలని సూచించినట్లు తెలిసింది.

ఫైళ్లను తనిఖీ చేసి రికవరీ చేస్తాం

ఫ్యామిలీ క్వాంటమ్ పెన్షన్, బకాయిలు మంజూరు చేసిన ఫైళ్లను తనిఖీ చేస్తాం. వయసు పెంచి జారీ చేసి ఉంటే వారి నుంచి సొమ్మును రికవరీ చేస్తాం. కొన్ని ఫైళ్లు మాత్రమే నా దగ్గరకు వచ్చాయి. మిగిలినవి అక్కడి ఈఈ పరిధిలో మంజూరు చేశారు. నా పరిశీలనకు వచ్చిన వాటిలో కొన్ని వెనక్కి పంపగా, ఇంకొన్ని రికవరీ చేయమని ఆదేశాలు జారీ చేశాను.

- బ్రహ్మయ్య, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, విద్యుత్ శాఖ, రాయచోటి.

సర్వేయర్ ఆత్మహత్యాయత్నం

- తహసీల్దార్ వేధింపులతోనే : సర్వేయర్
- ఆసుపత్రికి తరలింపు..ప్రమాదం లేదన్న వైద్యులు



ఆస్పత్రిలో ఉన్న సర్వేయర్ హసీన్‌తాజ్

మదనపల్లె, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం తహసీల్దార్ తేజశ్వి, మండల సర్వేయర్ హసీన్‌తాజ్ మధ్య కొన్ని రోజులుగా జరుగుతున్న వివాదం ముదిరి పాకాన పడి సర్వేయర్ ఆత్మహత్యాయత్నం వరకూ దారి తీసింది. పెద్దమండ్యం మండలం వెలిగల్లులో భూముల రీసర్వే జరుగుతోంది. ఈ ప్రక్రియ పూర్తి కావచ్చిన క్రమంలో గ్రామ సర్వేయర్లు ఆ వివరాలు ఎల్‌పీ నెంబర్లతో సహా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. తర్వాత వాటిని రికార్డుల పరంగా సరిచూసి వీఆర్వోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఆ పని కూడా గ్రామ సర్వేయర్లు చేయాలని తహసీల్దార్ చెప్పినట్లు చెబుతున్నారు. అయితే మా పని వరకు మాత్రమే మేం చేయగలం, వీఆర్వోల పని వారే చేయాలని సర్వేయర్ తెగేసి చెప్పడంతో ఇద్దరి మధ్య వివాదానికి కారణమైనట్లు తెలుస్తోంది. ఇలా వారం రోజులుగా అటు తహసీల్దార్, ఇటు మండల సర్వేయర్ మధ్య అంతర్యుద్ధం కొనసాగుతోంది. నాలుగు రోజుల క్రితం డీఐ లక్ష్మీనారాయణ, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ దృష్టికి ఇదే విషయం సర్వేయర్ తీసుకెళ్లారు. సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు డీఐ లక్ష్మీనారాయణ పెద్దమండ్యం వెళ్లి తహసీల్దార్, సర్వేయర్ మధ్య సర్దుబాటు చేసి వచ్చారు. అయితే గురువారం రెవెన్యూ కార్యాలయంలో విధులకు హాజరైన తహసీల్దార్, సర్వేయర్‌ల మధ్య మరోసారి వివాదం చోటు చేసుకుంది. తనపై సబ్‌కలెక్టర్‌కు ఎందుకు ఫిర్యాదు చేశావని సర్వేయర్‌ను తహసీల్దార్ ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైై కార్యాలయం నుంచి బయటకు వెళ్లిన సర్వేయర్ హసీన్‌తాజ్ మధ్యాహ్నం నిద్రమాత్రలు మింగినట్లు వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు గుర్తించారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ప్రాణాపాయం లేదని చెప్పడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, జిల్లా సర్వే అధికారి భరత్‌కుమార్, మదనపల్లె డీఐ లక్ష్మీనారాయణలు జిల్లా ఆసుపత్రికి వెళ్లి సర్వేయర్‌ను పరామర్శించారు.

వైభవంగా సీతారాముల కళ్యాణం

- కోదండరామాలయంలో గురుపౌర్ణమి వేడుకలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కోదండరామాలయంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమిరోజున ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం గురుపౌర్ణమి కావడంతో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. ఆలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, మనోజ్‌కుమార్‌లు వేదమంత్రాల మధ్య కల్యాణతంతు జరిపించారు. జిల్లా నుంచే కాక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి కల్యాణాన్ని వీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, ఎంపీపీ నల్గొండ లక్ష్మీదేవి, ఎంపీపీ ప్రతినిధి నల్గొండ వెంకటసుబ్బారెడ్డి, ఆలయ అధికారులు హనుమంతప్ప, నవీన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

- ఉదయం 6 గంటలకే గ్రామాలకు వెళ్లాలి ● డీపీవో రాధమ్మ



గూడరేవుపల్లె పంచాయతీలో ఇంటింటి నుంచి చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీవో రాధమ్మ

పీలేరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో చెత్త సేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించమని డీపీవో రాధమ్మ హెచ్చరించారు. గురువారం ఆమె పీలేరు మండలం గూడరేవుపల్లె పంచాయతీలో అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు పంచాయతీ కార్యదర్శులు గ్రామాలకు వెళ్లాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి పొడి, తడి చెత్తను సేకరించాలని, కమిషనర్ కార్యాలయం నుంచి చెత్త సేకరణపై ఫోన్ కాల్స్ వస్తుంటాయని, ప్రజల నుంచి పాజిటివ్ ఆన్సర్ వచ్చేలా తమ పనితీరు మార్చుకోవాలని తెలిపారు. చెత్త సేకరణపై ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సూచించారు. చెత్త నుంచి సంపద సేకరణ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి కేంద్రం నుంచి ఎరువులు తయారు చేసి తద్వారా వచ్చే ఆదాయంతో కేంద్రాల నిర్వహణ, వర్కర్ల జీతాలు చెల్లించాలని సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమస్యలపై సచివాలయాలకు వచ్చే ప్రజల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించరాదన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని తెలిపారు. డీపీవో వెంట పీలేరు డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శులు సిగ్బతుల్లా, అబ్దుల్ రహీం, హరిత సిచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై సౌమ్యనాథుడి చిద్విలాసం



చంద్రప్రభ వాహనంపై దర్శనమిచ్చిన సౌమ్యనాథుడు

నందలూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం సౌమ్యనాథస్వామి కూర్మాలంకారంలో సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి కృష్ణుడి అలంకారంలో చంద్రప్రభ వాహనంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం సౌమ్యనాథసేవా ట్రస్టు అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

డిగ్రీ కళాశాలలో ఆర్జేడీ విచారణ

- మూడేళ్ల ఖర్చులపై నివేదికలు



బీటీ కళాశాలలో అక్రమాలు జరిగాయని ఆర్జేడీకి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి జేఏసీ నేతలు

మదనపల్లె టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నత విద్యా శాఖ ఆర్జేడీ నాగలింగారెడ్డి విచారణ చేపట్టారు. గురువారం కళాశాలకు వచ్చిన ఆయన మూడు రోజుల పాటు కార్యాలయ సిబ్బంది నిర్వహించిన తనిఖీ నివేదికలపై ఆరా తీశారు. బీటీ కళాశాల ప్రభుత్వపరమైనప్పటి నుంచి మూడేళ్ల పాటు యూజీసీ విడుదల చేసిన నిధులు, విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజుల గురించి ఆరా తీశారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన ఆనందరెడ్డి హయాంలో చేసిన ఖర్చుల గురించి రికార్డులు పరిశీలించారు. వసూలు చేసిన ఫీజులు ఏ బ్యాంకులో డిపాజిట్ చేశారు, ఖర్చులకు సంబంధించి బిల్లులు, రసీదులు, ఓచర్ల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఇక్కడి అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేస్తున్నారన్నారు. ఇక్కడ కొత్తకోర్సులు ప్రవేశపెట్టాలని విద్యార్థులు తల్లిదండ్రులు విన్నవిస్తున్నారని, విద్యార్థుల సంఖ్య పెరిగితే కొత్త కోర్సులు మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. బీటీ కళాశాల విద్యార్థి జేఏసీ నేత ఆర్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ఉత్తన్న, బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ ఆర్జేడీని కలసి వినతి పత్రం అందజేశారు. కళాశాల ఆస్తులను బీసెంట్ సెనేటరి ట్రస్టు నుంచి స్వాధీనం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పరం చేసుకునేటప్పుడు కళాశాలకు సంబంధించి అప్పటి కరెస్పాండెంట్ కళాశాల ఫిక్స్‌డ్ డిపాజిట్లను అక్రమంగా దారి మళ్లించారని ఆరోపించారు. వీటన్నింటిపై విచారించాలని కోరారు.

మా సర్టిఫికెట్లు ఇప్పించండి సార్...

- సబ్‌కలెక్టర్‌ను ఆశ్రయించిన ఫార్మసీ విద్యార్థులు



సబ్‌కలెక్టరేట్‌కు వచ్చిన కృష్ణచైతన్య ఫార్మసీ కళాశాల విద్యార్థినులు

మదనపల్లె టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా నలుమూలల నుంచి వచ్చి ఫార్మసీ కోర్సు చదువుతున్నాం, మా ఒరిజినల్ సర్టిఫికెట్లు అన్నీ కళాశాల యజమాన్యం తీసేసుకుంది. ఇప్పుడు సర్టిఫికెట్లు ఇవ్వమంటే తిరగబడుతున్నారని కృష్ణచైతన్య ఫార్మసీ కళాశాల విద్యార్థినులు 400 మంది సబ్‌కలెక్టర్‌ను ఆశ్రయించారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్దకు కృష్ణచైతన్య కళాశాలకు చెందిన విద్యార్థినులు వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తాము ఫార్మసీ కోర్సులో చేరేటప్పుడు తమ టెన్త్, ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, టీసీలు అన్నీ కళాశాల యజమాన్యంకు ఇచ్చామన్నారు. ఇప్పుడు కళాశాల యజమాన్యం రెండు వర్గాలుగా విడిపోయిందని, ఓ వర్గానికి చెందిన మల్లికార్జున, రామ్మోహన్, లోకేశ్‌కుమార్, గోపాల్‌రెడ్డి వద్ద తమ సర్టిఫికెట్లు ఉండిపోయాయన్నారు. ఇప్పుడు తమ సర్టిఫికెట్లు చూపమన్నా వారు స్పందించలేదన్నారు. దీనిపై విచారించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ కళాశాలకు చెందిన ఇరువర్గాలను పిలిపించి విచారిస్తామని, విద్యార్థినులకు సర్టిఫికెట్లు ఇచ్చేలా చూస్తామని వారికి హామీ ఇచ్చారు.

ప్రతిభను వెలికితీసేందుకే...

- మెగా పీటీఎంలో మంత్రి మండిపల్లి



విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటిటౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మెగా పీటీఎం ఏర్పాటు చేసినట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌ల ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలను ప్రక్షాళన చేయడంతో పాటు అనేక మార్పులు తీసుకొచ్చి ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నట్లు తెలిపారు. గతంలో పిల్లలను పోషించడం తల్లిదండ్రులకు చాలా కష్టంగా ఉండేదని, అలాంటిది ఇప్పుడు ప్రభుత్వమే పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తల్లికి వందనం పేరుతో సంవత్సరానికి రూ.15 వేలు, రెండు జతల స్కూల్ యూనిఫామ్, షూస్, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం పథకం కింద సన్నబియ్యంతో కూడిన మంచి ఆహారాన్ని తదితర అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థుల ప్రతిభను పటిష్ఠం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి పాఠ్యాంశాల ప్రగతితో పాటు విద్యార్థులో దాగి ఉన్న నైపుణ్యం, ఆటలు, క్రీడలు లాంటి విన్యాసాల్లో ప్రావీణ్యం తదితర వాటిని అధ్యయనం చేసి విద్యార్థులను అభివృద్ధి పథంలో నడిపించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. పిల్లలు పాఠశాల ఆవరణంలో పాఠశాల పరిసరాల్లో, ఇంటి ఆవరణంలో మొక్కలను తల్లిదండ్రుల పేరుతో నాటి వాటిని సంరక్షిస్తే పర్యావరణానికి తోడ్పాటునిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లులకు పాదపూజ చేశారు. కార్యక్రమంలో డీఈవో సుబ్రహ్మణ్యం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, అర్చనా విద్యాసంస్థల అధినేత డాక్టర్ మదన్ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఎంఈవోలు బాలాజీనాయక్, వెంకటశివారెడ్డి, సమగ్ర శిక్ష సీఎంవో కరుణాకర్, ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ సాలయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



తల్లులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

ప్రవేశం.. పరీక్షే!

- గురుకులాల అధికారుల్లో సమన్వయలోపం
- విద్యార్థుల ప్రవేశాల్లో అయోమయం
- కార్యాలయాలు, కళాశాలల చుట్టూ జనం



బ్రహ్మంగారి మఠంలోని మహాగురుకులం



కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఈ ఏడాది విద్యార్థుల ప్రవేశాల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. నిబంధనల ప్రకారం గురుకులాల్లో ప్రతి సంవత్సరం ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ముందుగానే పరీక్షలు నిర్వహించి అందులో వచ్చిన మార్కుల ఆధారంగా రోస్టరు ప్రకారం సీట్లు కేటాయిస్తారు. ఈ ఏడాది 5, 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు గత నెలలో మరోసారి పరీక్షలు నిర్వహించి వారికి వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తున్నారు. ఇందులో ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయి, వారికి ఎక్కడ సీట్లు కేటాయిస్తున్నారన్న విషయంలో స్పష్టత లేదు. మిగలిపోయిన సీట్లకు విద్యార్థులను భర్తీ చేసుకునే వెసులుబాటును ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు అప్పగించారనేది సమాచారం. ఈ క్రమంలో మెరిట్ ఆధారంగా కాకుండా ఇష్టానుసారం సీట్లు కేటాయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కార్యాలయాల చుట్టూ

వేసవి సెలవుల్లోనే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించారు. కొన్ని కారణాల చేత రాత పరీక్ష రాయలేని విద్యార్థులు గురుకుల విద్యాలయాల్లో సంప్రదించగా సీట్లు మిగిలిపోతాయి, మీ వివరాలు ఇవ్వండి అంటూ ఒక ప్రత్యేక రిజిస్టరు పెట్టి అందులో నమోదు చేసుకున్నారు. కళాశాలలు తెరిచే సమయానికి వీరు గురుకులాల్లో సంప్రదిస్తే ప్రవేశపరీక్ష రాసిన వారందరూ చేరిన తరువాత మీకు ఫోను చేస్తామని చెప్పారు. దీంతో చాలామంది విద్యార్థులు ఫోన్ల కోసం ఎదురు చూశారు. ఇదిలా ఉండగా ప్రవేశపరీక్ష రాయలేని విద్యార్థులకు సీట్ల కేటాయింపు కోసం వచ్చిన వినతులను కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి ఆయన అనుమతి తరవాత ప్రవేశాలు చేపడతామని జిల్లా సమన్వయ అధికారి చెప్పారని కొంతమంది చెబుతున్నారు. ఇవేవీ కాదని కళాశాలల్లోనే ప్రిన్సిపాల్స్ ఇంటర్మీడియట్ ప్రవేశాలు పూర్తిచేయడంతో

- మిగతా 6వ పేజీలో

థాయ్‌లాండ్‌లో యువకుల అదృశ్యంపై

డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు



వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

రాజంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా నుంచి థాయిలాండ్‌కు జీవనోపాధి కోసం వెళ్లిన ముగ్గురు యువకుల ఆచూకి తెలియజేయాలని రాజంపేటకు చెందిన పూజారి గిరిజా కోరారు. ఈ మేరకు భారత ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వారి ఆచూకి కనుగొనాలని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో ఆమె కలిసి వినతి పత్రం అందజేశారు. కాగా ఆయన వెంటనే స్పందించి వారికి న్యాయం చేస్తామని తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు. రాజంపేట పట్టణం ఎస్వీ నగర్‌కు చెందిన ఓ యువకుడితో పాటు మరో ఇరువురు ఉద్యోగ నిమిత్తం మూడు నెలల కిందట థాయిలాండ్‌కు వెళ్లగా ఇంతవరకు వారి సమాచారం తెలియడం లేదన్నారు. అంతేకాక మదనగోపాలపురం, కడప, విజయనగరం, విశాఖపట్టణం, హైదరాబాదు నుంచి మరికొందరు కూడా వెళ్లారని, వీరి ఆచూకి కోసం ఎంత ప్రయత్నిస్తున్నా ఎవరూ తెలపడం లేదని, ఈ విషయమై ఇప్పటికే ఎందరో నాయకలను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు



నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కలికిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న ఆవుల మల్లికార్జునను అరెస్టు చేసినట్లు వాల్మీకిపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.లత తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు అక్రమంగా నాటుసారా అమ్ముతున్న మల్లికార్జున వద్ద నుంచి 17 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి అనంతరం రిమాండుకు పంపినట్లు ఆమె చెప్పారు. మల్లికార్జునను విచారించగా గోళ్లతోపుకు చెందిన బి.మణికంఠ తనకు నాటుసారా సరఫరా చేశాడని అంగీకరించినట్లు సీఐ పేర్కొన్నారు. మణికంఠ కోసం ప్రయత్నించగా పరారీలో ఉ న్నట్లు తేలిందని చెప్పారు. అతడిపై కూడా కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో తనతో పాటు ఎస్ఐ సుభాషిణి, హెచ్‌సీ బాలయ్య, సిబ్బంది సలీం, షేర్ ఆలీ పాల్గొన్నారని వివరించారు.

అమ్మో.. టమోటాల వాహనాలా..!

- మార్కెట్‌కు త్వరగా వెళ్లాలని అధిక వేగం
- 90 శాతం ప్రమాదాలు టమోటా వాహనాలతోనే...
- జాతీయ రహదారిలో ఊసేలేని పోలీస్ పెట్రోలింగ్





ములకలచెరువు మార్కెట్‌కు టమోటాలు తీసుకొచ్చిన వాహనాలు - వేపూరికోట సమీపంలో ప్రమాదానికి గురైన టమోటాలు తీసుకెళ్తున్న వాహనం

ములకలచెరువు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కు టమోటాలు తీసుకెళ్తున్న వాహనాలు హడలెత్తిస్తున్నాయి. సమయానికి టమోటాలు మార్కెట్‌కు తీసుకెళ్లాలని అతివేగం, అజాగ్రత్తగా డ్రైవర్లు వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. వేగాన్ని అదుపు చేయలేక ఎదురుగా వస్తున్న వాహనాలపై దూసుకెళ్తూ చుక్కలు చూపిస్తున్నారు. ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలో 90 శాతం ప్రమాదాలు టమోటా వాహనాలతోనే జరుగుతున్నాయి. ములకలచెరువు మార్కెట్‌కు ప్రతిరోజూ వందలాది వాహనాలు టమోటాలు తీసుకుని వస్తున్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం, తంబళ్లపల్లె మండలాలతో పాటు మదనపల్లె మండలం, శ్రీసత్యసాయి జిల్లా తదితర ప్రాంతాల నుంచి టమోటాలను ఇక్కడి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ముఖ్యంగా టమోటాలు మార్కెట్‌లో దించేసి ఖాళీగా వెళ్తున్న వాహనాలు అత్యంత వేగం, ఇష్టానుసారంగా వెళ్తుండడంతో అధిక ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇటీవల చోటు చేసుకున్న ప్రమాదాల్లో కొన్ని

- ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలోని వేపూరికోట పంచాయతీ ఆవులవారిపల్లె క్రాస్ వద్ద ఇటీవల భారీ పరిమాణం గల ఇనుప పైపులతో వెళుతున్న లారీని టమోటాలు తీసుకెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. లారీలో ఉన్న ఇనుప పైపులు బొలెరో వాహనం మీద పడడంతో బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీ పాత కురవపల్లెకు చెందిన రైతులు బగ్గల రాజన్న (55) దుర్మరణం చెందగా మరో రైతు తీవ్రంగా గాయపడ్డాడు. లారీని ఢీకొన్న బొలెరో వాహనం రోడ్డుకు అడ్డంగా ఉండడంతో జాతీయ రహదారిలో రోడ్డుకు ఇరువైపులా 10 కిలో మీటర్ల మేరకు ట్రాఫిక్ స్తంభించి వాహనాలు బారులుతీరి నిలిచిపోయాయి.
- మండలంలోని వేపూరికోట క్రాస్‌లో మే 21వ తేదీ ద్విచక్రవాహనాన్ని టమోటాలు తీసుకెళ్తున్న ఐచర్ ఢీకొనడంతో దేవళచెరువుకు చెందిన అమ్మాజాన్ దుర్మరణం చెందింది. ఐచర్ వేగంగా వచ్చి రోడ్డు పక్కన వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది.
- ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలోని ములకలచెరువు రైల్వే గేటు వద్ద ఈ ఏడాది ఏప్రిల్ 14న టాటాఏస్ వాహనం ఢీకొనడంతో శ్రీ సత్యసాయి జిల్లా జిల్లా ముదిగుబ్బకు చెందిన కుళాయప్ప (60) దుర్మరణం చెందగా నారాయణస్వామితో పాటు మరొకరు తీవ్రంగా గాయడ్డారు.
- ఈ ఏడాడి ఫిబ్రవరిలో జాతీయ రహదారిలోని కదిరినాధునికోట క్రాస్ సమీపంలో రోడ్డు దాటుతున్న గోళ్లపల్లెకు కొండా సూర్యనారాయణను టమోటాలు మార్కెట్‌లో దించి వస్తున్న బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో సూర్యనారాయణ దుర్మరణం చెందాడు. ఇలా టమోటా వాహనాలతో ఎన్నో ప్రమాదాలు జరిగిన పలువురు గాయపడ్డ సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇక ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలు టమోటా వాహనాలతోనే అధికంగా జరిగాయి.

ఊసేలేని పోలీస్ పెట్రోలింగ్

ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలో పోలీస్ పెట్రోలింగ్ ఊసేలేదు. జాతీయ రహదారి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు 42 కిలోమీటర్ల జాతీయ రహదారిని విస్తరణ చేసి కొత్తగా రోడ్డు వేశారు. దీంతో వాహనాలు అతి వేగంగా రాకపోకలు సాగిస్తుండడంతో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

వాహనాల వేగాన్ని నియంత్రించడానికి జాతీయ రహదారిలో పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు ఉంటాయి. అలాగే స్పీడ్ టెస్ట్ పరికరాల వాహనాలు కూడా ఉంటాయి. అయితే ఈ మార్గంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు, స్పీడ్ టెస్ట్ పరికరాల వాహనాలు లేకపోవడంతో వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలు నివారించే చర్యలు లేకుండా పోయాయి.

వేగం చూస్తుంటే భయమేస్తోంది



మార్కెట్‌కు టమోటాలు తీసుకెళ్లే వాహనాల వేగం చూస్తుంటే భయమే స్తోంది. ఇటీవల మదనపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా టమోటాలు తీసుకెళ్తున్న ఐచర్ వాహనం వేగంగా కారు మీదకు వస్తుండగా డ్రైవర్ చాకచక్యంగా పక్కకు వచ్చేశాడు. లేదంటే ప్రమాదానికి గురయ్యేవాళ్లం. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని జాతీయ రహదారిలో వాహనాల వేగం నియంత్రణకు పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలి.

- వెంకటరమణ, ములకలచెరువు

సాయంత్రమైతే ట్రాఫిక్ జామ్



జాతీయ రహదారిలో రోడ్డుకు ఇరువైపులా నిలిపిన టమోటా వాహనాలు

ములకలచెరువులో సాయంత్రమైతే భారీగా ట్రాఫిక్ స్తంభించిపోతోంది. మార్కెట్‌కు టమోటాలు తీసుకొస్తున్న వాహనాల్లోని కాయలను దించి తరువాత స్థలం చాలక బయటకు పంపుతున్నారు. దీంతో మార్కెట్ యార్డు సమీపంలోని ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలో వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలిపేస్తున్నారు. ప్రతిరోజూ మార్కెట్ యార్డు నుంచి బంగ్లా వరకు వాహనాలు రోడ్డుకు ఇరువైపులా బారులు తీరుతున్నాయి. దీంతో జాతీయ రహదారిలో రాకపోకలు సాగించే ఇతర వాహనాలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది.

సాయంత్రమైతే ట్రాఫిక్‌జామ్



ములకలచెరువులోని మార్కెట్‌యార్డు వద్ద జాతీయ రహదారిలో ప్రతిరోజూ ఇరువైపులా టమోటా వాహనాలు నిలుపుతుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. వాహనాలను ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా నిలిపేస్తున్నారు. రాత్రయితే ఏ ప్రమాదం జరుగుతుందోనని భయమేస్తోంది. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఆర్టీసీ బస్టాండు స్థలంలో వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలి.

- మతీన్‌బాషా, ములకలచెరువు

పైపులు, కేబుల్‌కు నిప్పు

పెద్దతిప్పసముద్రం జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్టేవాండ్లపల్లె పంచాయతీ పరిధిలోని కమ్మచెరువులో ఓ నిరుపేద కుటుంబీకుడు దార సోమశేఖర్ పొలం వద్ద కేబుల్ వైరు, పీవీసీ పైపులకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని గురువారం బాధితుడు పోలీసులకు పిర్యాదు చేశాడు. తమ గ్రామ శివారులో పొలంలో బోరువేసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించుకుంటుంటే బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వలన తమ పొలంలో అమర్చుకున్న పైపులు, బోరు మోటర్‌కు అమర్చిన విద్యుత్ కేబుల్ పూర్తిగా దగ్ధమైందన్నారు. సుమారు రూ 60 వేలు నష్టం వాటిల్లిందని క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సుగుణ

బి.కొత్తకోట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్లపల్లెకు చెందిన వివాహిత సుగుణ (30) గురువారం ఉదయం క్రిమిసంహారిణి తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆరునెలల కిందట ఓ వ్యక్తి వద్ద అప్పుచేసి తీర్చలేకపోవడంతో అతను వేధించాడని, అవమానం భరించలేక, చేసిన అప్పు తీర్చలేక సుగుణ ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె మదనపల్లెలో చికిత్స పొందుతోంది. మిగతా వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

నంది వాహనంపై దర్శనమిచ్చిన సిద్దేశ్వర స్వామి

రాజంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య ఇలవేల్పు దేవుళ్ల సిద్ధేశ్వర, చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం నందివాహనంపై సిద్ధేశ్వర, చెన్నకేశవస్వామి దర్శనమిచ్చారు. గురువారం సాయంత్రం తాళ్లపాక పురవీధుల్లో వాహన మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించి నంది వాహనంపై చెన్నకేశవ సిద్ధేశ్వరస్వాములు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

రూ. 13 లక్షల విలువైన ఎర్రచందనం పట్టివేత

- రెండు వాహనాలు సీజ్... ఇద్దరు స్మగ్లర్ల అరెస్ట్



ఎర్రచందనం దుంగలతో పట్టుబడ్డ స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న దృశ్యం

పీలేరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల నుంచి అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న రూ.13 లక్షల విలువైన ఎర్రచందనం పట్టుకున్నట్లు పీలేరు ఫారెస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో గురుప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన పీలేరు ఫారెస్ట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పులిచెర్ల-కల్లూరు మార్గంలోని రైల్వే వంతెన వద్ద ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గురువారం తెల్లవారుజామున పులిచెర్ల నుంచి కల్లూరు వైపు అతివేగంగా టాటా ఇన్‌ట్రా వీ20 వాహనం వచ్చిందన్నారు. ఆ వాహనాన్ని ఆపి తనిఖీ చేస్తుండగా మరో టవేరా వాహనం వచ్చిందన్నారు.

ఇంతలోనే టవేరా వాహనంలోని ఒకరు వాహనం నుంచి దూకి చీకట్లోకి పారిపోయినట్లు తెలిపారు. అప్రమత్తమైన ఫారెస్ట్ అధికారులు ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. రెండు వాహనాలను తనిఖీ చేయగా అందులో సుమారు 200 కిలోల బరువు గల 8 ఎర్రచందనం దుంగలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. పట్టుబడిన ఎర్రచందనం, రెండు వాహనాలు, ఇద్దరు స్మగ్లర్లను పీలేరు ఫారెస్ట్ కార్యాలయానికి తరలించి విచారించగా ఇద్దరు స్మగ్లర్లు తిరుపతి బొమ్మగుంట ప్రాంతానికి చెందిన నరసింహులు, పవన్ కళ్యాణ్‌గా గుర్తించామన్నారు. వీరు రుయా ఆస్పత్రిలో అంబులెన్స్ డ్రైవర్లుగా పనిచేస్తున్నట్లు విచారణలో వెలుగు చూసిందన్నారు. మరో ప్రధాన స్మగ్లర్ మల్లికార్జున పారిపోయినట్లు తెలిపారు. పారిపోయిన స్మగ్లర్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఆయన చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఆర్‌వో ఎస్.చంద్ర శేఖర్, ఎస్ఎస్ఓ కె.ప్రకాష్‌కుమార్, ఎఫ్‌బీఓలు కె.ప్రతాప్, పి.రెడ్డిప్రసాద్ ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

శాకాంబరి అలంకారంలో అమ్మవారు



రాయచోటిటౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం గురుపౌర్ణమి సందర్భంగా గురువారం పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళీ అమ్మవారు శాకాంబరి మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తదితర ఫలాలతో శాకాంబరీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో వ్యాస మహర్షి రేణుకాచార్యుల వారికి అర్చక స్వాములు భక్తులు కలిసి గురుపూజ కార్యక్రమాన్ని నిర్వహించి గురుపూజోత్సవ విశిష్టత గురించి తెలియజేశారు. స్థానికులతో పాటు కన్నడ భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ

చైర్‌పర్సన్‌గా వరలక్ష్మి

కలికిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్‌పర్సన్‌గా పగడాల వరలక్ష్మిని నియమించింది. స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్ గౌరవాధ్యక్షుడిగా చిన్నం శివయ్యను ఉపాధ్యక్షుడిగా నామినేట్ చేశారు. పాలకవర్గ సభ్యులుగా బచ్చు రామచంద్ర, ఎస్.బాలసుబ్రమణ్యం, సి.నాగేశ్వర రాజు, కసుపర్తి శంకరయ్య, కటికం సుబ్రమణ్యం, కాటూరి నరసింహులు, కేతు రజినీకాంత్‌రెడ్డి, ముత్యాల సురేఖ, గద్దె పెంచలయ్య, యమలా నాగేశ్వరి, నల్లంశెట్టి చిన్నయల్లయ్య, షేక్ మహబూబ్ బాషా, తుపాకుల పెంచలయ్యలను నియమించారు. ఇక చిట్వేలి సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జీని, కోడూరు వ్యవసాయ శాఖ ఏడీ, కె.బుడుగుంటపల్లె సర్పంచ్‌ను, జిల్లా మార్కెటింగ్ శాఖ డీఏటీ పదవుల రీత్యా నియమింపబడ్డారు.

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బంది సేవలందించాలని మార్గదర్శకులను, బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతంగా చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతిలోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పీ-4 కార్యక్రమం, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ, మలేరియా డెంగ్యూ తదితర వ్యాధుల వ్యాప్తి, తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనల మేరకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంక్షేమ శాఖల వారి పరిధిలో ఉన్న హాస్టళ్లను అన్నింటిని తనిఖీ చేసి నివేదికలను సమర్పించాలన్నారు. కమ్యూనిటీ శానిటేషన్ సెంటర్లకు సంబంధించిన వెంటనే చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖ ఎస్ఈ ప్రసన్నకుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రవేశం.. పరీక్షే!

- గురుకులాల అధికారుల్లో సమన్వయలోపం
- విద్యార్థుల ప్రవేశాల్లో అయోమయం
- కార్యాలయాలు, కళాశాలల చుట్టూ జనం

(5వ పేజీ తరువాయి)

అంతా అయోమయంగా మారింది. ఈ క్రమంలో ఇటు కలెక్టర్ కార్యాలయం, అటు కళాశాలల చుట్టూ విద్యార్థులు, వా రి తల్లిదండ్రులు తిరుగుతున్నారు. సీట్ల భర్తీ విషయంలో అధికారుల సమన్వయ లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రెండు జిల్లాల్లో 23 గురుకులాలు

వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో 23 గురుకులాలు ఉన్నాయి. ఇందులో గండిక్షేత్రం, బ్రహ్మంగారిమఠం, సగిలేరు, పులివెందుల, బి.కొత్తకోట, రామాపురం, రైల్వేకోడూరు సాంఘిక సంక్షేమ గురుకులాలు బాలురకు నిర్వహిస్తున్నారు. బాలికలకు సంబంధించి చిన్నచౌకు, పులివెందుల, గుండ్లకుంట, మడకలవారిపల్లె, రాజుపాలెం, కొండాపురం, కమలాపురం, పీలేరు, బురకాయలకోట, మదనపల్లె, వాల్మీకిపురం, రాయచోటి, దేవపల్లె, ఆడపూరుతో పాటు లక్కిరెడ్డిపల్లెల్లో గురుకుల పాఠశాలలున్నాయి. ఇందులో 14,250 సీట్లకు గాను 13,395 సీట్లు విద్యార్థులకు కేటాయించామని ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యాలయ అధికార యంత్రాంగం పేర్కొంది. మిగలిన 855 సీట్లకు ఈ నెల 15న కౌన్సెలింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

మహాగురుకులం వైపే అందరి నడక

వైఎస్సార్ కడప జిల్లాలోని బ్రహ్మంగారిమఠంలో ఏర్పాటు చేసిన మహా గురుకులం వైపే విద్యార్థుల అడుగులు పడుతున్నాయి. చాలా గురుకులాల్లో మౌలిక వసతులు కొరవడడం, సక్రమంగా విద్యాబోధన జరగకపోవడంతో ప్రతి సంవత్సరం సీట్లు మిగిలిపోతూ వచ్చాయి. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, కలెక్టర్ శ్రీధర్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని మహాగురుకులంలో ఆధునాతన వసతులు కల్పించడంతో పాటు సీట్ల భర్తీకి విరివిగా ప్రచారం జరగడంతో ఎక్కువమంది అందులో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు.

దీంతో ఈ గురుకులంలో ఇప్పటికే సీట్లు భర్తీ అయిపోయాయని అంటున్నారు. అయితే పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా కాకుండా ప్రిన్సిపాల్, సిబ్బంది ఇష్టానుసారంగా ప్రవేశాలు కల్పించడంతో చాలామంది మెరిట్ విద్యార్థులు నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది. రోస్టర్ ప్రకారం కొన్ని కులాల సీట్లు మిగిలి పోయాయని వీటిని అదే కేటగిరీలో వేరే కులాల వారికి కేటాయించాలని కొందరు కోరుతున్నారు. దీనిపై కలెక్టర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సీటు అయితే ఎక్కడో చోట లభ్యమవుతుంది. ఇంటర్మీడియట్‌కు సంబంధించి సీట్లు ఎక్కడ ఉన్నాయనేది పరిశీలిస్తున్నాం. బ్రహ్మంగారిమఠం మహాగురుకులంలో దాదాపు అడ్మిషన్లు పూర్తయ్యాయి. పాఠశాల విద్యకు సంబంధించి సీట్లు అలాట్ చేసిన జాబితా కూడా కార్యాలయంలో అందుబాటులో ఉంచాం.

- ఉదయశ్రీ, గురుకుల విద్యాలయాల సమన్వయ అధికారి

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ వెంకటేశ్వర్లు

రాయచోటిటౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను తెలుసుకోవడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల పర్యటన చేస్తున్న ఆయన గురువారం ఉమ్మడి కడప జిల్లాకు వచ్చిన సందర్భంగా రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం సానుకూలంగానే ఉందని, ఉద్యోగులు కూడా అదే స్థాయిలో ఉన్నారని చెప్పారు. అయితే గత ప్రభుత్వం 12వ పీఆర్‌సీని అమలు చేస్తానని చెప్పి అమలు చేయలేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్‌సీ అమలు చేస్తానని చెప్పినా ఇంతవరకు అమలు చేయలేదని, పీఆర్‌సీ కమిటీని వేయకుండా కాలయాపన చేస్తుండడంతో ఉద్యోగుల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేక భావన పెరుగుతోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం పీఆర్‌సీని అమలు చేసిందని, ఇక్కడ కూడా వెంటనే పీఆర్సీని అమలు చేసి ఉద్యోగుల్లో వ్యతిరేక భావనలు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి నేతలు నరసింహాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



చిన్నమండెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై మల్లూరు క్రాస్ వద్ద గురువారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో శెట్టిపల్లి కొండారెడ్డికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చిన్నమండెం మండలం కొత్తపల్లికి చెందిన శెట్టిపల్లి కొండారెడ్డి ద్విచక్రవాహనంలో తమ ఊరు నుండి మల్లూరు రూల్ వెళ్లాల్సి ఉండగా మల్లూరు క్రాస్ వద్దకు రాగానే క్రాస్ వద్దకు రాగానే వెనుక వైపునుంచి వస్తున్న కారు ఢీకొన టడంతో కొండారెడ్డికి కాళ్లు చేతికి తీవ్ర గాయమైనట్లు స్థానికులు తెలిపారు. వెంటనే అతన్ని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కొర్రపాడు రోడ్డు విస్తరణకు మోక్షం ఎప్పుడో..!


విస్తరించాల్సిన కొర్రపాడు రోడ్డు

- కట్టడాల తొలగింపునకు రూ.13 కోట్లు
- భూసేకరణకు రూ.44 కోట్లు
- రోడ్డు నిర్మాణానికి రూ.18 కోట్లు
- నిధుల మంజూరుకు ఎమ్మెల్యే యత్నం

ప్రొద్దుటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రధాన రోడ్ల విస్తరణ జరగాల్సి వుంది. పట్టణంలోని నాలుగు దిక్కుల నాలుగు ప్రధాన రహదారులు వున్నాయి. మైదుకూరు రోడ్డు, కొర్రపాడు రోడ్డు, జమ్మలమడుగు రోడ్డు, ఎర్రగుంట్ల రోడ్లు వున్నాయి. వీటిని మాస్టర్‌ప్లాన్ రోడ్ల విస్తరణలో చేర్చినప్పటికీ ఇప్పటికి కేవలం మైదుకూరు రోడ్డు మాత్రమే 100 అడుగుల విస్తీర్ణంతో కొంత శాతం మేర విస్త రణ జరిగింది. ఇంకా పూర్తి స్థాయిలో మున్సిపాలిటీ లిమిట్స్‌లో జరగాల్సి వుంది. ఇందుకు కొందరు భవన యజమానులు కోర్టుకు వెళ్లడంతో మైదుకూరు రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయి. అయితే కొర్రపాడు రోడ్డు విస్తరణ పనులను గత టీడీపీ ప్రభుత్వం మొదలు పెట్టిన తరువాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఆ పనులు ఆగిపోయాయి. తిరిగి కూటమి ప్రభుత్వం రావడంతో కొర్రపాడు రోడ్డు విస్తరణ పనులను చేపట్టడానికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మళ్లీ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా అయిన ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణను సైతం కలిసి నిధులు మంజూరు చేయాలని కోరారు.

వంద అడుగుల విస్తరణ

మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆధ్వర్యంలో కొర్రపాడు రోడ్డును 100 అడుగుల మేర విస్త రణకు భవనాలకు మార్కింగ్ వేశారు. దాదాపు 85 కట్టడాలను గుర్తించారు. వీటిని తొలగించాలంటే భవన యజమానులకు పరిహారంగా దాదాపు రూ.13 కోట్లు చెల్లించాల్సి వుంటుందని మార్కెట్ వాల్యూ ప్రకారం అంచనా వేశారు. అలాగే రోడ్డు విస్తరణకు భూమిని కోల్పోయే వారికి నష్టపరిహారంగా దాదాపు రూ.44కోట్ల మేర చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేశారు.

నిధులు విడుదలైతే పనులు ప్రారంభం

కొర్రపాడు రోడ్డు విస్తరణలో కట్టడాల తొలగింపు చేపట్టాలంటే భవన యజమానులకు రూ.13కోట్ల మేర నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుంది. ఆ నిధులు విడుదల కాగానే కట్టడాలు తొలగింపు పనులు చేపడతాం. రోడ్డు విస్తరణకు భూమి కోల్పోయే బాధితులకు ప్రభుత్వం టీడీఆర్ బాండ్లు జారీ చేస్తుంది. రోడ్డు నిర్మాణ పనుల కోసం ఆర్‌అండ్‌బీ ఇచ్చిన రూ.5.85 కోట్ల నిధులతో పనులు మొదలు పెడతారు.
-చింతా రవిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు.

రూ.44కోట్లకు టీడీఆర్ బాండ్లు

భూసేకరణకు మాత్రం టీడీఆర్ బాండ్లను జారీ చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. కానీ భూమి కోల్పోయే బాధితులు మాత్రం తమకు టీడీఆర్ బాండ్లు వద్దని.. నష్టపరిహా రం నగదు రూపంలోనే కావాలని కోరుతున్నారు. అయితే కొందరు మాత్రం టీడీఆర్ బాండ్లకైనా ముందుకు వచ్చారు. మరికొందరు పేదలు ముఖ్యంగా ఎర్రన్న కొట్టాలకు చెందిన ఎస్సీలు తమ ఇళ్లు పోతే తాము ఎక్కడ జీవించాలని.. ఎటువంటి పరిస్థితిలో అంగీకరించమని చెబుతున్నారు. అయితే పేదల ఇళ్ల నిర్మాణాలు తొలగిస్తే వాటికి నష్టపరిహారంతో పాటు ప్రభుత్వం ఉచితంగా రెండు సెంట్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణా నికి రుణం కూడా అందజేస్తుందని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సంబంధిత ఎస్సీల పెద్దలతో చర్చించి హామీ ఇచ్చారు.

రూ.5.85 కోట్లు నిధులు విడుదల

కొర్రపాడు రోడ్డు నిర్మాణానికి సంబంధించి రూ.5.85 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఆర్‌అండ్‌బీశాఖ నుంచి జీవో ఎంఎస్ నెం 151ను 29.3.2025న ప్రభుత్వం విడుదల చేసింది. అయితే 1.97 కిమీటర్ల మేర చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు ఈ నిధులు ఏ మాత్రం సరిపోవు. ఈ రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్స్ షిఫ్టింగ్ పనులకు, రోడ్డుకు ఇరువైపుల కాలువల నిర్మాణానికి, ఫుట్ పాత్ ఏర్పాటుకు రోడ్డు మధ్య డివైడర్లు, మొక్కల ఏర్పాటుతో పాటు బ్యూటిఫికేషన్, ఎలక్ట్రిఫికేషన్ పనులకు కలిపి దాదాపు మరో రూ.12 కోట్లు కావాల్సి వస్తుందని అంచనా వేశారు. ఈ రూ.12కోట్ల నిధుల మంజూరు కోసం గత ఏడాది డిసెంబరులోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపా రు. ఈ నిధులు ఆర్‌అండ్‌బీ మంజూరు చేస్తే పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ఇక కట్టడాల తొలగింపు పరిహారం రూ.13కోట్ల విడుదలైతే రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతాయి. అయితే మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్‌శాఖ ఈ నిధులు విడుదల చేయాల్సి వుంది. ఆమేరకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణను కలిసి విన్నవించారు. ఈ నిధులకు మోక్షం లభించి నట్లయితే కొర్రపాడు రోడ్డు విస్తరణ జరిగి ప్రొద్దుటూరు అభివృద్ధి గాడిన పడినట్లవుతుంది.

ఆర్కిటెక్చర్ విద్యార్థుల సమస్యకు త్వరలో పరిష్కారం : మంత్రి లోకేశ్


మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు, చిత్రంలో ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆర్కిటెక్చర్ విద్యార్థుల సమస్యకు త్వరలో పరిష్కారం చూపుతామని.. ఎలాంటి ఆందోళన చెందవద్దని రాష్ట్ర ఐటీ విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ అన్నారు. గురువారం సత్యసాయి జిల్లాలో నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమలాపురం ఎమ్మెల్యే పుత్తాచైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆర్కిటెక్చర్ విద్యార్థులు లోకేశ్‌ను కలిశారు. యూనివర్సిటీలో గుర్తింపు విషయమై తాము ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రికి విన్నవించారు. అందుకు లోకేశ్ సానుకూలంగా స్పందించి చదువు కునే బాధ్యత మీది.. సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది అని హామీ ఇచ్చా రు. అన్ని విషయాలను కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌తో చర్చిస్తామని.. విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగనివ్వమని స్పష్టం చేశారు. దీంతో విద్యార్థులు మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించాలి

కడప రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంపై కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎల్‌ఎస్‌ఏ ఇన్‌చార్జ్ సెక్ర టరీ, సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి తెలిపారు. గురువారం జిల్లా కోర్టు ప్రాంగణలో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లా డుతూ ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలను అందజేస్తున్నారన్నారు. అలాగే కడప ఆర్టీసీ బస్టాండ్, కలెక్టరేట్ కార్యాలయం, రైల్వేస్టేషన్, మున్సిపల్ కార్పొ రేషన్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఫ్లెక్సీలను, బ్యానర్లను ప్రదర్శించా మని తెలిపారు.

ప్రతి కార్యకర్త ధైర్యంగా ఉండండి : ఎంపీ

పులివెందుల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలందరు ధైర్యంగా ఉండాలని.. ఎటువంటి ఇబ్బందులకు గురిచేసిన ధైర్యాన్ని కోల్పోవద్దని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వైఎస్సార్ ఆడిటో రియం లో పులివెందుల నియోజక వర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పడ్డ ప్పటి నుంచి అరాచకపాలన సాగుతోందన్నారు. కానీ ఎవరు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. అందరికి వైసీపీ అండగా ఉంటుందన్నారు.

పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం


ఉచిత వైద్య శిబిరం ప్రారంభిస్తున్న డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు, జూలై 10 (ఆంధ్ర జ్యోతి): స్థానిక గాంధీరోడ్డులో హోలిస్టిక్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో గురువారం పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య శిబి రాన్ని డీఎస్పీ భావన ప్రారంభించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో నిత్యం ఒత్తిళ్ల కారణంగా రకరకాల జబ్బులు బారిన పడుతుంటారని.. తరుచూ బాడీ చెకప్ చేయించుకుంటే ఆరోగ్యం సంర క్షించుకోగలరన్నారు. కాగా, ప్రొద్దుటూ రు, మైదుకూరు, జమ్మలమడుగు డివి జన్‌లకు చెందిన పోలీసు సిబ్బంది ఉచితంగా జనరల్‌బాడీ హెల్త్‌చెకప్‌తోపాటు డయాబెటిక్ ప్రొఫైల్, కిడ్నీ ప్రొఫైల్, లిపిడ్‌ప్రొఫైల్, లివర్ ప్రొఫైల్ కార్డియాక్ ప్రొఫైల్‌కు సంబంధించి స్పెషలిస్టుల పర్యవేక్షణలో వైద్యపరీక్షలు నిర్వహిస్తార తెలిపారు.

స్థానికేతర వర్గీకరణతో విద్యార్థులకు తీవ్రనష్టం

కడప ఎడ్యుకేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోత): ఉన్నత విద్యా ప్రవేశ పరీక్షల్లో స్థానికేతర వర్గీకరణ వల్ల విద్యార్థులకు తీవ్రనష్టం వాటిల్లుతోందని ఉపా ధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివా సులరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక రాష్ట్రంలో చదువుకునే విద్యార్థులను కేవలం వారి నివాస ప్రాతిపదికన వర్గీకరించడం వల్ల అవకా శాలలలో అసమానతలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం ఈ విష యంపై దృష్టిసారించి అడ్మిషన్ల ప్రక్రియలో స్థానికేతర విద్యార్థులకు నష్టం కలుగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం

- కాలిపోయిన వస్తువులు, నగదు


కాలి బూడిదైన వస్తువులు

ఎర్రగుంట్ల, జూలై 10 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని చిలమకూరులో గురువారం మధ్యాహ్నం ఓ ఇంట్లో విద్యు త్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లోని వస్తువులు, నగదు కాలి బూడిదయ్యాయి. బాధి తుల వివరాల మేరకు.. చిల మకూరుకు చెందిన తలారి చలమయ్య ఇంటిలో ఎవరూ లేని సమ యంలో గురువారం మధ్యాహ్నం 12గంటల సమయంలో షార్టు సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం సంభవిం చింది. దీంతో ఇంట్లోని వంటసామగ్రితో పాటు, వస్తువులు, రూ.30వేలు నగదు మంటల్లో కాలిపోయినట్లు వాపోయారు. అధికారులు తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

రైలుకింద పడి హమాలీ ఆత్మహత్య



ఎర్రగుంట్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో గురు వారం రైలుకింద పడి ఆవుల క్రిష్ణయ్య (64) అనే హమాలీ ఆత్మ హ్యాత చేసు కున్నాడు. స్థానిక ముద్దనూరు రోడ్డులోని టౌన్ బ్యాంకు వెనుక వైపు నివాసం ఉంటున్న క్రిష్ణయ్యకు గత కొంత కాలంగా ఆరోగ్యం సరిగా లేదు. గురు వారం గూడ్స్ రైలుకింద పడి ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డా డు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం



కడప క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ప్రకాశ్‌నగర్ చెందిన సురభి లక్ష్మీ దేవి అనే వివాహిత కనిపించడం లేదని ఆమె భర్త సురభి నాగ ప్రసాద్ చిన్నచౌకు పోలీసుస్టేష న్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. సురభి లక్ష్మిదేవి నగరంలోని మాం గళ్య షాపింగ్‌మాల్‌లో పనిచేస్తోంది. 8వ తేదీ మధ్యాహ్నం సుమారు 12.40కి తన తల్లి ఊరైన లక్కి రెడ్డిపల్లె మండలం కస్తూరిరాజుపల్లె వద్ద గల మాదిగపల్లె పోయి వస్తానని చెప్పి వెళ్లింది. అయితే అక్కడకు ఫోను చేయగా రాలేదని తెలిసింది. బంధు వుల ఇళ్లల్లో విచారించగా ఆచూకీ తెలియలేదు. ఈ మేరకు గురువారం ఆమె భర్త చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి



కడప క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రైల్వేస్టేషన్ పార్కింగ్ స్థలం వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు కడప వన్‌టౌన్ ఎస్‌ఐ అమర్ నాథ రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు మృతి చెంది న వ్యక్తి వయస్సు 45 నుంచి 48 వరకు ఉంటుంద న్నారు. రెండు రోజులుగా రైల్వేస్టేషన్ సమీపం లోని పార్కింగ్ స్థలం వద్ద ఉంటున్నాడని, అయితే అతిగా మద్యం తాగడంతో అపస్మా రకస్థితిలోకి వెళ్లి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి పూర్తి వివరాలకు 9121100510కు ఫోనుచేసి మరింత సమాచారం తెలుసుకోవ చ్చని కోరారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

చక్రాయపేట,జూలై 10 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవ స్థానం సమీపంలో గురువారం వేరుశనగ చెత్తను ట్రాక్టర్ తీసుకొస్తుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభం విరిగిపడి వేరుశనగ చెత్తపై తీగలు పడ్డాయి. ఆ సమయంలో కరెంటులేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.

ఆరోగ్య కేంద్రానికి మెడిసిన్ తెప్పించాలి


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వెంటనే మెడిసిన్ అందుబాటులోకి తీసుకురావాలని టీఎన్‌ఎస్‌ఎఫ్ వైవీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం వైవీయూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. హెల్త్ సెంట ర్‌లో గత కొంతకాలంగా మందులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని.. తక్షణం మెడిసిన్ తీసుకురావాలని నినాదాలు చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనవాసులు, హెల్త్ సెంటర్ వద్దకు చేరుకోగా.. విద్యార్థులు వారికి వనతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీఎన్‌ఎస్ ఎఫ్ వైవీయూ అధ్యక్షుడు భరత్‌సింహ, నాయకులు కిషోర్, గంగన్న, రంజిత్, గౌస్, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నమయ్య కాలిబాటలో భక్తులను అడ్డుకున్న పోలీసులు

- అడవి నుంచి కుక్కలదొడ్డి ప్రధాన దారికి తరలింపు


అన్నమయ్య కాలిబాటలో వెళుతున్న భక్తులను వెనక్కు పంపిస్తున్న ఏఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే

రైల్వేకోడూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య కాలి బాటలో గురువారం తిరుమలకు వెళుతున్న భక్తులను అటవీ శాఖ, పోలీసు అధికారులు అడ్డుకున్నారు. చాలా మంది అడవిలో ఉండడంతో రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే, జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్‌సింగ్, రైల్వేకోడూరు సీఐలు హేమసుదరరావు, వెంకటేశ్వర్లు, రైల్వేకోడూరు రేంజర్ శ్యాంసుం దర్, బాలపల్లె డీఆర్‌వో బాలచంద్రుడు తదితర సిబ్బంది సమా చారం అందుకుని హుటాహుటిన అడవిలోకి వెళ్లి భక్తులను అక్కడి నుంచి కుక్కలదొడ్డి ప్రధాన దారికి పంపించారు. అనంతరం రోడ్డు మార్గం గుండా తిరుమలకు వెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా కమలాపురం నియోజ కవర్గంలోని పెద్దచెప్పలి తదితర ప్రాంతాల నుంచి ఆదివారం తిరుమల పాదయాత్ర ను ప్రభాకర్‌రెడ్డి అనే భక్తుడు సుమారు 900 మందితో ప్రారంభించారు. పాదయాత్ర గురు వారం ఉదయానికి కుక్కలదొడ్డికి చేరుకుంది. ఈ విషయం తెలుసుకున్న అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటూ అడవిలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. ఏనుగులు ఉన్నాయని హెచ్చరించి వెనక్కి పంపించారు. కాగా కొందరు అధికారుల కళ్లుగప్పి వెళు తున్న భక్తులను కూడా కుక్కలదొడ్డి ప్రధాన దారి వద్దకు తరలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ శెట్టిగుంట, కుక్కలదొడ్డి, రేణిగుంట మండలంలోని మామండూరు నుంచి తిరుమలకు అటవీ మార్గంలో ప్రస్తుతం 65 ఏనుగులు సంచరిస్తున్నాయని తెలి పారు. కొన్ని రోజులుగా పిల్లలతో ఉన్న ఏనుగుల మంద తరచుగా సంచరిస్తున్నట్లు తెలిపారు. దీంతో కుక్కలదొడ్డి నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళ్లడం శ్రేయస్కరం కాదన్నారు.

తిరుమల కాలిబాటకు ప్రవేశం రద్దు : సబ్‌కలెక్టర్

రాజంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట, కుక్కలదొడ్డి మార్గంలో ఏనుగుల సంచారం ఉన్నందున ఈ ప్రాంతంలో తిరుమలకు వెళ్లే భక్తులకు పాదయాత్రను రద్దు చేస్తున్నట్లు రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని రోజులుగా పిల్లలతో ఏనుగుల మంద తిరుగుతోందన్నారు. ఈ ఏనుగుల మంద స్వరూపం చాలా భీకరంగా ఉంటుందని, ఇవి దాడులకు పాల్పడి ప్రాణహాని చేసే అవకాశం ఉందని, ఈ మార్గంలో ఎవరూ వెళ్లడానికి వీలులేదన్నారు. ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా కుక్కలదొడ్డి నుంచి తిరుమల వెళ్లే కాలిబాటలో పాద్రయాతను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా భద్రత దృష్ట్యా ఏనుగుల దాడి నుంచి ప్రజలను రక్షిం చడానికి ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కావున భక్తులు సహకరించి ఈ మార్గంలో వెళ్లకుండా ఇతర మార్గాల్లో తిరుమలకు వెళ్లాలని తెలిపారు.

ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం

- కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సంఘం సంపూర్ణ సహకారం
- రిటైర్డ్ జిల్లా కలెక్టర్ కె.ప్రభాకర్‌రెడ్డి



ఉత్తమ విద్యార్థులను గోల్డ్ మెడల్, సర్టిఫికెట్లతో సత్కరించిన పూర్వ విద్యార్థి, రిటైర్డ్ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సంఘం ఇతోధికంగా కృషి చేస్తుందని రిటైర్డ్ కృష్ణా జిల్లా కలెక్టర్ కె.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాల వ్యవస్థాపక దినోత్సవం ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అధ్యక్షతన ఘనంగా నిర్వ హించారు. కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు కలిసి కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సహ కారంతో చేసిన ఈ కార్యక్రమంలో 2024-25 విద్యా సంవత్సరం లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినీ, విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. అలాగే కళాశాలలో పనిచేసిన పూర్వ గురువులను ఘనంగా సత్కరిం చారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బంగారుపతకాలు అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం బాధ్యులు ఆచార్య పుత్తా రాజశేఖరరెడ్డి, డాక్టర్ ఎంసీ వెంకటసుబ్బయ్య, టీవీ సుబ్బారెడ్డి, సీపీడీసీ సభ్యులు చిన్నప రెడ్డి హాజరై ప్రసగించారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి డాక్టర్ శివరామ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కడప, అనంతపురం మ్యాచ్ డ్రా

- కర్నూలుపై చిత్తూరు జట్టు ఘన విజయం

కడప స్పోర్ట్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్ 19 మెన్స్ మల్టీ డే (మూడు రోజుల) క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం రెండు వేర్వేరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో కడప, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. అలాగే కర్నూలు, చిత్తూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్ లో చిత్తూరు జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

కేవోఆర్‌ఎం మైదానంలో...

కడప నగర శివారు ప్రాంతం కేవోఆర్‌ఎం మైదానంలో కడప, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన కడప జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 93.2 ఓవర్లలో 495 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తదుపరి బ్యాటింగ్ దిగిన అనంతపురం జట్టు 67 ఓవర్లలో 250 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. దీంతో కడప జట్టుకు 245 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 107 ఓవర్లలో 9 వికెట్లను కోల్పోయి 455 పరుగులు చేసింది. ఇందులో రోహిత్ వర్మ 133, ఆర్జిత్‌రెడ్డి 111 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో నిర్వాహకులు మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

ఏసీఏ మైదానంలో

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదట కర్నూలు జట్టు బ్యాటింగ్ చేపట్టి తన మొదటి ఇన్నింగ్స్‌లో 77.4 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌట్ కాగా, తదుపరి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 63.4 ఓవర్లలో 251 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో కర్నూలు జట్టుకు 31 పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం రెండోరోజు కర్నూలు జట్టు 71.2 ఓవర్లలో 272 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో మొత్తం రెండు ఇన్నింగ్స్‌లకు కలిపి 303 పరుగులు ఆధిక్యత సాధించింది. ఇందులో హృదయ్ 85, విఖ్యాత్ 85 పరుగులు చేశారు. అనంతరం మూడోరోజు గురువారం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు 42.2 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయానికి అవసరమైన 304 పరుగులు సాధించి జయకేతనం ఎగురవేశారు. ఇందులో లోహిత్ లక్ష్మీనారాయణ 138 పరుగులు సాధించారు. దీంతో చిత్తూరు జట్టు 7 వికెట్ల తేడాతో విజయభేరి మోగించింది.



రోహిత్ వర్మ, ఆర్జిత్‌రెడ్డి, లోహిత్ లక్ష్మీనారాయణ

16న మండల ఉపాధ్యక్ష ఎన్నిక

సంబేపల్లె, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె ఉపాధ్యక్షుని కొరకు ఈ నెల 16న ఎన్నిక ప్రక్రియ చేపడుతున్నట్లు ఎంపీడీవో రామచంద్ర గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఎన్నిక ప్రక్రియ నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలియజేశారు. ఇటీవల మండల ఉపాధ్యక్షులకు గుట్టపల్లి ఎంపీటీసీ అభ్యర్థి పొత్తూరి రవీంద్ర నాయుడు రాజీనామా చేయడంతో ఎన్నిక ప్రక్రియ అనివార్యమైనట్లు తెలిపారు. 11 మంది ఎంపీటీసీ సభ్యులందరూ హాజరుకావాలని తెలియజేశారు.

500 మొక్కలు పంపిణీ

రామాపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలు నాటి వాటిని పెంచాలని శ్రీమన్నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ రేకం నారాయణ అన్నారు. మండలంలోని కసిరెడ్డిగారి పల్లె పంచాయతీలోని హైస్కూల్ ఆవరణంలో బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు 500 మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల ఏర్పాటు శుభసూచికం

గాలివీడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలుకుంట గ్రామం వరికుంటపల్లి సమీపంలో లక్ష్మీనరసింహస్వామి, కొత్తపురమ్మ దేవాలయాల ఏర్పాటు ఈ ప్రాంతానికి శుభసూచికమని సర్పంచ్ పార్థసారధిరెడ్డి పేర్కొన్నారు. గురువారం గురుపౌర్ణమి సందర్భంగా ఆలయాల నిర్మాణ ప్రాంగణంలో ఆలయ ప్రధాన బండ్రెడ్డి రవీంద్రారెడ్డి, గ్రామస్థులు, ఆత్మీయులతో అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, రామాంజుల్‌రెడ్డి, నాగిరెడ్డి, చరణ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, టోపీవలి, వెంకటేశు, వెంకటశివారెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు భక్తులకు అన్నదానం

నందలూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చారిత్రాత్మక నందలూరు సౌమ్యనాథస్వామి కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు సోమలరాజు చంద్రశేఖర్‌రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఈ అవకాశాలను భక్తులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఉద్యోగులకు ఘన సత్కారం

సిద్దవటం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర మండలాలకు బదిలీ అయిన గ్రామ సచివాలయ ఉద్యోగులను సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. మండలంలోని నేకనాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం బదిలీపై వెళ్లిన గ్రామ సచివాలయ ఉద్యోగులకు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వో రేణుక, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

సిద్దవటం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అమలుపరిచే పథకాలపై ఏవో రమేష్‌రెడ్డి గురువారం వ్యవసాయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రమైన సిద్దవటం వ్యవసాయ కార్యాలయంలో ఆయన సలహాలు సూచనలు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది హసీనా బేగం, చంద్ర, మోహన్, శివప్రసాద్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు నగదు పురస్కారం

పుల్లంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌బీవీడి సభ ఉన్నత పాఠశాల, శ్రీ బీవీ శేషయ్య సంస్కృత ఉన్నత పాఠశాలల్లో ప్రతిభ చూపిన విద్యార్థలకు దాత బోగా వెంకటరామయ్య నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థలకు దాత రూ.47 వేలు అందజేశారు. స్థానిక ఎంపీడీవో శిరీషా దాత వెంకటరామయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, ఏవో శ్రీధర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరు ప్రవీణ్‌కుమార్, నియోజకవర్గ వీవర్స్ వింగ్ ప్రెసిడెంట్ పార్థసారది పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి





గాలివీడు : సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మిప్రసాద్‌రెడ్డి, రైల్వేకోడూరు : విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి, రాజంపేట : ఆత్మీయ సమావేశంలో విద్యార్థులను సత్కరిస్తున్న గురువులు, తల్లిదండ్రులతో చమర్తి జగన్‌మోహన్‌రాజు

గాలివీడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నదని నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ కార్యక్రమంలో భాగంగా నూలివీడులోని శ్రీ సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడి ఉన్నప్పటికీ ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తల్లికివందనం కార్యక్రమాన్ని అమలు చేసినట్లు తెలిపారు. త్వరలో మహిళలకు బస్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్, ఎంఈవో నాగరాజ్, పూలికుంట సర్పంచ్ పార్థసారధిరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, నూలివీడు సొసైటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రియాజ్, టీడీపీ నాయకులు రాంమోహన్ నాయుడు, కుమార్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, నాగేశ్వరరావు, మిట్టేనాయక్, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: తెలుగుదేశం ప్రభుత్వంలోనే విద్యకు సీఎం పెద్దపీట వేశారని టీడీపీ మండల ఇన్‌చార్జి యనమల మదన్‌మోహన్, ఎస్‌ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. గురువారం కస్తూర్బా గురుకుల పాఠశాల, జడ్పీ బాలికల సాంఘిక సంక్షేమశాఖ, ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన మెగా తల్లిదండ్రుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వర్ల రమేశ్, కేజీబీవీ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: పాఠశాలల అభివృద్ధికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషిచేయాలని నియోజకవర్గ టీడీపీ నాయకుడు లక్ష్మిప్రసాద్‌రెడ్డి, డీఈవో సుబ్రమణ్యంలు పిలుపునిచ్చారు. మండలంలోని కొండావాండ్లపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈవో-2 జయచంద్ర, టీడీపీ నాయకులు సహదేవరెడ్డి, హరినాథ్‌రెడ్డి, రాజారావు పాల్గొన్నారు.

సంబేపల్లె: ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యంతో విద్యా ప్రగతి సాధ్యమని, జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ తెలిపారు. గురువారం దేవపట్ల గురుకుల పాఠశాల సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్స్ సమావేశం 2.0 ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, సర్పంచ్ రామచంద్ర, ఎంఈవో-2 శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాజంపేట: గురువులు తల్లిదండ్రులతో సమానులని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జనసేన పార్లమెంట్ నాయకుడు శ్రీనివాసరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, ఎంఈవో రఘునాధరాజు, తదితరులు పాల్గొన్నారు.

శాన్వి ఇంటర్నేషన్ స్కూల్‌లో

రాజంపేట శాన్వి ఇంటర్నేషన్ స్కూల్ విద్యాలయంలో ఆ పాఠశాల కరస్పాండెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన్నూరు సీఐ కుళాయప్ప, కరస్పాండెంట్ శరత్‌కుమార్‌రాజు పాల్గొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విద్యార్థులు గౌరవించి చదువులో రాణించాలి

రైల్వేకోడూరు: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విద్యార్థులు గౌరవించి చదువులో రాణించాలని జనసేన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డిలు తెలిపారు. గురువారం రైల్వేకోడూరు జూనియర్ కళాశాల, ప్రభుత్వ హైస్కూళ్లలో మెగా పేరంట్స్ మీట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మెమెంటోలు అందజేశారు.

సచివాలయ ఉద్యోగిని ఆత్మహత్య


మృతురాలు రాజేశ్వరి (ఫైల్ ఫొటో)

రైల్వేకోడూరు రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లి మండలంలోని బలిరెడ్డిపల్లి సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సూర్య రాజేశ్వరి(32) కోడూరు పట్టణంలో తన నివాసంలో ఉరేసుకుని మృతిచెందింది. పోలీసుల వివరాల మేరకు.. ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరానికి చెందిన మృతురాలు రాజేశ్వరి 2019 సంవత్సరంలో బాలిరెడ్డిపల్లి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరింది. కోడూరు పట్టణంలోని ప్రధాన రహదారి పాత బస్టాండ్ గంగమ్మ గుడి ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. గురువారం ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా ఇంట్లో ఉరేసుకుని మృతిచెందింది. వెంటనే మృతదేహన్ని శవ పరీక్ష నిమిత్తం కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ కె.హేమసుందర్ తెలిపారు. ఇటీవల తండ్రి మరణించడం, చెల్లెలు భర్త కూడా ఇటీవల మృతి చెందడంతో తీవ్ర మనస్థాపానికి గురైంది. ఇటీవల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆమె సుండుపల్లి మండలంలోని సొంటంవారిపల్లి గ్రామ పంచాయతీకి బదిలీ అయింది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని, మృతురాలి తల్లి రవణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా రైల్వే కోడూరు జనసేన పార్టీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్... రాజేశ్వరి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకుని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె మృతికి కారణాలపై ఆరా తీశారు. బాధితురాలి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సమగ్ర దర్యాప్తు చేయాలి : కలెక్టర్

రాజేశ్వరి మృతి పట్ల కలెక్టర్ శ్రీధర్ స్పందించారు. మృతికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని రాజంపేట సబ్ కలెక్టర్, సంబంధిత పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యం

● ప్రత్యేక అధికారి సురేశ్‌కుమార్


ఆర్థిక సాయం అందజేస్తున్న వేములయ్య

సుండుపల్లె, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల బలోపేతమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేక అధికారి సురేశ్‌కుమార్ తెలిపారు. గురువారం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్న తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాయవరం ప్రభుత్వ బడికి అదే ఊరికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వేములయ్య రూ.50 వేలు కంప్యూటర్ ఏర్పాటు కోసం అందజేయడం జరిగిందన్నారు. అదే పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగరాజునాయక్ మండల మొదటి స్థానం సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్. ఆసియాకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి: మంత్రి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి

రామాపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు లక్ష్మిప్రసాద్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీ కొండావాండ్లపల్లెలో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, లక్ష్మిప్రసాద్‌రెడ్డిలు పర్యటించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో సమస్యలపై ఆరాతీశారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ నాగసుబ్బారెడ్డి, సహదేవరెడ్డి, సురేందర్‌రెడ్డి, చంద్రమౌళి, వెంకట్రామిరెడ్డి, రామకృష్ణగౌడ్, తిమ్మారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

పార్టీ శ్రేయస్సు కోసం కృషి చేయాలి

● మండల ఎన్నికల పరిశీలకుడు గుత్తికొండ త్యాగరాజు

సుండుపల్లె, జూలై 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రేయస్సు కోసం కార్యకర్తలకు అండగా పనిచేసే వారిని గుర్తించి గ్రామ అధ్యక్షులుగా నియమించుకోవాలని మండల సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు గుత్తికొండ త్యాగరాజు తెలిపారు. గురువారం తిమ్మసముద్రం గ్రామ పంచాతీయతీలో గ్రామ ఎన్నికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధినేత ఆదేశాలను తూచా తప్పకుండా పాటించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలియజేశారు. అనంతరం తిమ్మసముద్రం, భాగంపల్లి, జి.రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీలో గురువారం గ్రామ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మహేశ్‌నాయుడు, మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, తెలుగు యువత అధ్యక్షుడు సురేశ్‌నాయుడు, మాజీ మండలాధ్యక్షుడు శివారెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, ప్రసాద్‌రాజు, మోహన్‌బాబునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'రైతు సాధికారతకు మరో అడుగు'

చిన్నమండెం, జూలై 10(ఆంధ్రజ్యోతి): రైతు సాధికారతకు ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో ఏటీఎం మోడల్‌ను ఏర్పాటు చేయడం మరో అడుగు ముందుకు వేయడమేనని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ అన్నారు. మండలంలోని ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ వద్ద ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఏటీయం మోడల్‌ను సోయింగ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఏఈవో బ్లెస్సీ, పీహెచ్‌సీ డాక్టర్ సునీతలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంటీ శ్రీనివాస్, పద్మావతి, మోడల్ మేకర్ రెడ్డయ్య, వ్యాల్యూ చైన్ చంద్రశేఖర్, కమ్యూనికేషన్ వీణ ఐసీఆర్‌పీఎస్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చెత్త సేకరణ సైకిల్ అందజేత


ట్రై సైకిల్‌ను అందజేస్తున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), జూలై 10(ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణ సామర్థ్యాన్ని పెంచేందుకు కేవలం రూ.లక్ష ఖర్చుతో తయారు చేయించిన ట్రై సైకిళ్లను కలెక్టర్ చామకూరి శ్రీధర్ గురువారం రాయచోటి మండలం పెమ్మాడపల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీ సహజీయా సుల్తానాకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పంచాయతీ సెక్రటరీని ఉద్దేశించి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో చేయించిన ద్విచక్రవాహనాన్ని వినియోగించుకుని గ్రామ పంచాయతీ పరిధిలో వందశాతం ఇళ్ల ద్వారా చెత్తను సేకరించాలని ఆదేశించారు. వాహన సామర్థ్యాన్ని, మైలేజ్‌ను, వాహన పనితీరును వారం రోజుల పాటు పరిశీలించి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో రాధమ్మ, రాయచోటి ఎంపీడీవో సురేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపేరుతో మొక్కలు నాటిన విద్యార్థులు

పెనగలూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం జరిగిన మెగా పేరంట్స్ కమిటీ సమావేశంలో తన తల్లితో కలిసి విద్యార్థుల చేత 2221 మొక్కలు నాటించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నల్లపురెడ్డిపల్లెలో పీఎంసీ చైర్మన్ కె.క్రిష్టారెడ్డి, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు. ఎంఈవో-1 గిరివరదయ్య, ఎంఈవో-2 నాగసుబ్బరాయుడు, ఎంపీడీవో విజయరావులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ మెరుపు దాడులు

రైల్వేకోడూరురూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి, చిట్వేలి మండలంలో గురువారం ఎక్సైజ్ శాఖ అధికారి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర ఆధ్వర్యంలో మెరుపుదాడులు నిర్వహించి 51 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా కోడూరు పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కోడూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 33 నాటుసారా కేసులు నమోదు చేసి 29 మందిని అరెస్టు చేశామని, బెల్టుషాపులపై దాడులు నిర్వహించి 24 కేసులు నమోదు చేసి 345 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు 80 బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సీఐ వి.ఎల్లయ్య, టి.కె.తులసి, ఎస్‌ఐ వరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ట్రాఫిక్ డైవర్షన్

నందలూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సౌమ్యనాథస్వామి కల్యాణోత్సం సందర్భంగా శుక్రవారం నందలూరు టౌనులో ట్రాఫిక్ డైవర్షన్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొత్తపి, చెన్నయ్యగారిపల్లె, లేబాక గ్రామాల వైపు నుంచి నందలూరు టౌన్‌కు వచ్చే ప్రజలు సౌమ్యనాథస్వామి ఆలయం వైపు దారిలో రాకుండా ఈదరపల్లె, దుర్గాపురం మీదుగా నందలూరు టౌన్‌లోకి వెళ్లాలన్నారు. కల్యాణానికి వచ్చే భక్తులు నందలూరు హరిజనవాడ దగ్గర ఉన్న పార్కింగ్ ప్రదేశంలో వాహనాలు నిలిపి కాలినడకన రావాలన్నారు. మండల ప్రజలు, నాయకులు, పాత్రికేయులు పోలీసువారికి సహకరించాలని కోరుతున్నామన్నారు.

యల్లమ్మకు ప్రత్యేక పూజలు

● బోనం కూడు సమర్పించిన మహిళలు


బోనం కూడు తీసుకెళ్తున్న మహిళలు

సిద్దవటం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారిలోని భాకరాపేట సమీపంలో వెలసిన యల్లమ్మ అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. మొదట గ్రామంలోని గ్రామదేవత గంగమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కాలినడకన మహిళలు నడుచుకుంటూ యల్లమ్మ సన్నిధికి చేరుకున్నారు. సకాలంలో వర్షాలు పడి ప్రతి రైతు భోగభాగ్యాలతో సిరిసంపదలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు.

జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలి

చిట్వేలి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పిల్లలు చదువుల్లో రాణిస్తూ క్రీడలతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది పతకాలు సాధించాలని రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం చిట్వేలిలో కొత్తగా ఏర్పాటు చేసిన తైక్వాండో స్వీకే స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఫిట్‌నెస్ జిమ్ మాస్టర్ బాలే, నాగేశ్వర, సాయివికాస్, కరస్పాండెంట్ రెడ్డయ్య, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురువు.. సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపుడు




నందగిరి స్వామికి పాదపూజ చేస్తున్న సాయిలోకేశ్, రైల్వేకోడూరు ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లె, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురువు సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ పేర్కొన్నారు. గురుపౌర్ణమి పురష్కరించుకొని గురువారం లక్కిరెడ్డిపల్లెలో వెలసిన మాతాంగ పీఠాధిపది మాతాంగ నందగిరిస్వామి పాద పూజ చేసి గురు ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సాయిలోకేశ్ మాట్లాడుతూ గురువు అందరికంటే గొప్పవాడన్నారు. స్థానిక మాతాంగ పీఠం ఆవరణంలో చతుర్మాస దీక్షలు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర బీజేపీ కార్యనిర్వహణ కార్యదర్శి రామచంద్రారెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు వెంకటరామరాజు, బీజేపీ సీనియర్ నాయకుడు కృష్ణ వెంకటరమణ (గురుస్వామి) తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం: మండల వ్యాప్తంగా ప్రధాన ఆలయాల్లో గురుపౌర్ణమి పరిష్కరించుకొని భక్తులు భక్తిశ్రద్ధలతో బారులు తీరారు. దేవగుడిపల్లి గ్రామ పంచాయతీలోని శ్రీకాళికామాత ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని కాళీమాత విగ్రహాలను ప్రత్యేకంగా అలకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తాళాల భజనలతో, మధ్యాహ్నం వరకు పూజలు చేసిన అనంతరం వచ్చిన అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

రైల్వేకోడూరు: గురుపౌర్ణమి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని షిరిడీసాయి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అల్పాహారం, అన్నదానం కార్యక్రమాలను సాయి కంప్యూటర్స్ అధినేత ఆధ్వర్యంలో నిర్వహించారు.

సిద్దవటం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని ఎస్‌కేఆర్ నగర్, సాయినగర్, పోలీసు పటాలయంలో గురుపౌర్ణమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎస్‌కేఆర్ నగర్ భద్రావతి భావనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో షిర్డీసాయిబాబా మూలవిరాట్ విగ్రహాన్ని గ్రామోత్సవం చేసి భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

థాయ్‌లాండ్‌లో యువకుల అదృశ్యంపై
డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు


వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

రాజంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా నుంచి థాయిలాండ్‌కు జీవనోపాధి కోసం వెళ్లిన ముగ్గురు యువకుల ఆచూకి తెలియజేయాలని రాజంపేటకు చెందిన పూజారి గిరిజా కోరారు. ఈ మేరకు భారత ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వారి ఆచూకి కనుగొనాలని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో ఆమె కలిసి వినతి పత్రం అందజేశారు. కాగా ఆయన వెంటనే స్పందించి వారికి న్యాయం చేస్తామని తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు. రాజంపేట పట్టణం ఎస్వీ నగర్‌కు చెందిన ఓ యువకుడితో పాటు మరో ఇరువురు ఉద్యోగ నిమిత్తం మూడు నెలల కిందట థాయిలాండ్‌కు వెళ్లగా ఇంతవరకు వారి సమాచారం తెలియడం లేదన్నారు. అంతేకాక మదనగోపాలపురం, కడప, విజయనగరం, విశాఖపట్టణం, హైదరాబాదు నుంచి మరికొందరు కూడా వెళ్లారని, వీరి ఆచూకి కోసం ఎంత ప్రయత్నిస్తున్నా ఎవరూ తెలపడం లేదని, ఈ విషయమై ఇప్పటికే ఎందరో నాయకలను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు


నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కలికిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న ఆవుల మల్లికార్జునను అరెస్టు చేసినట్లు వాల్మీకిపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.లత తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు అక్రమంగా నాటుసారా అమ్ముతున్న మల్లికార్జున వద్ద నుంచి 17 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి అనంతరం రిమాండుకు పంపినట్లు ఆమె చెప్పారు. మల్లికార్జునను విచారించగా గోళ్లతోపుకు చెందిన బి.మణికంఠ తనకు నాటుసారా సరఫరా చేశాడని అంగీకరించినట్లు సీఐ పేర్కొన్నారు. మణికంఠ కోసం ప్రయత్నించగా పరారీలో ఉ న్నట్లు తేలిందని చెప్పారు. అతడిపై కూడా కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో తనతో పాటు ఎస్ఐ సుభాషిణి, హెచ్‌సీ బాలయ్య, సిబ్బంది సలీం, షేర్ ఆలీ పాల్గొన్నారని వివరించారు.

అమ్మో.. టమోటాల వాహనాలా..!

- మార్కెట్‌కు త్వరగా వెళ్లాలని అధిక వేగం
- 90 శాతం ప్రమాదాలు టమోటా వాహనాలతోనే...
- జాతీయ రహదారిలో ఊసేలేని పోలీస్ పెట్రోలింగ్



ములకలచెరువు మార్కెట్‌కు టమోటాలు తీసుకొచ్చిన వాహనాలు - వేపూరికోట సమీపంలో ప్రమాదానికి గురైన టమోటాలు తీసుకెళ్తున్న వాహనం

ములకలచెరువు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కు టమోటాలు తీసుకెళ్తున్న వాహనాలు హడలెత్తిస్తున్నాయి. సమయానికి టమోటాలు మార్కెట్‌కు తీసుకెళ్లాలని అతివేగం, అజాగ్రత్తగా డ్రైవర్లు వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. వేగాన్ని అదుపు చేయలేక ఎదురుగా వస్తున్న వాహనాలపై దూసుకెళ్తూ చుక్కలు చూపిస్తున్నారు. ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలో 90 శాతం ప్రమాదాలు టమోటా వాహనాలతోనే జరుగుతున్నాయి. ములకలచెరువు మార్కెట్‌కు ప్రతిరోజూ వందలాది వాహనాలు టమోటాలు తీసుకుని వస్తున్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం, తంబళ్లపల్లె మండలాలతో పాటు మదనపల్లె మండలం, శ్రీసత్యసాయి జిల్లా తదితర ప్రాంతాల నుంచి టమోటాలను ఇక్కడి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ముఖ్యంగా టమోటాలు మార్కెట్‌లో దించేసి ఖాళీగా వెళ్తున్న వాహనాలు అత్యంత వేగం, ఇష్టానుసారంగా వెళ్తుండడంతో అధిక ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇటీవల చోటు చేసుకున్న ప్రమాదాల్లో కొన్ని

- ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలోని వేపూరికోట పంచాయతీ ఆవులవారిపల్లె క్రాస్ వద్ద ఇటీవల భారీ పరిమాణం గల ఇనుప పైపులతో వెళుతున్న లారీని టమోటాలు తీసుకెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. లారీలో ఉన్న ఇనుప పైపులు బొలెరో వాహనం మీద పడడంతో బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీ పాత కురవపల్లెకు చెందిన రైతులు బగ్గల రాజన్న (55) దుర్మరణం చెందగా మరో రైతు తీవ్రంగా గాయపడ్డాడు. లారీని ఢీకొన్న బొలెరో వాహనం రోడ్డుకు అడ్డంగా ఉండడంతో జాతీయ రహదారిలో రోడ్డుకు ఇరువైపులా 10 కిలో మీటర్ల మేరకు ట్రాఫిక్ స్తంభించి వాహనాలు బారులుతీరి నిలిచి పోయాయి.
- మండలంలోని వేపూరికోట క్రాస్‌లో మే 21వ తేదీ ద్విచక్రవాహనాన్ని టమోటాలు తీసుకెళ్తున్న ఐచర్ ఢీకొనడంతో దేవళచెరువుకు చెందిన అమ్మాజాన్ దుర్మరణం చెందింది. ఐచర్ వేగంగా వచ్చి రోడ్డు పక్కన వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది.
- ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలోని ములకలచెరువు రైల్వే గేటు వద్ద ఈ ఏడాది ఏప్రిల్ 14న టాటాఏస్ వాహనం ఢీకొనడంతో శ్రీసత్యసాయి జిల్లా జిల్లా ముదిగుబ్బకు చెందిన కుళాయప్ప (60) దుర్మరణం చెందగా నారాయణస్వామితో పాటు మరొకరు తీవ్రంగా గాయడ్డారు.
- ఈ ఏడాడి ఫిబ్రవరిలో జాతీయ రహదారిలోని కదిరినాధునికోట క్రాస్ సమీపంలో రోడ్డు దాటుతున్న గోళ్లపల్లెకు కొండా సూర్యనారాయణను టమోటాలు మార్కెట్‌లో దించి వస్తున్న బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో సూర్యనారాయణ దుర్మరణం చెందాడు. ఇలా టమోటా వాహనాలతో ఎన్నో ప్రమాదాలు జరిగిన పలువురు గాయపడ్డ సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇక ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలు టమోటా వాహనాలతోనే అధికంగా జరిగాయి.

ఊసేలేని పోలీస్ పెట్రోలింగ్

ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలో పోలీస్ పెట్రోలింగ్ ఊసేలేదు. జాతీయ రహదారి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు 42 కిలోమీటర్ల జాతీయ రహదారిని విస్తరణ చేసి కొత్తగా రోడ్డు వేశారు. దీంతో వాహనాలు అతి వేగంగా రాకపోకలు సాగిస్తుండడంతో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

వాహనాల వేగాన్ని నియంత్రించడానికి జాతీయ రహదారిలో పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు ఉంటాయి. అలాగే స్పీడ్ టెస్ట్ పరికరాల వాహనాలు కూడా ఉంటాయి. అయితే ఈ మార్గంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు, స్పీడ్ టెస్ట్ పరికరాల వాహనాలు లేకపోవడంతో వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలు నివారించే చర్యలు లేకుండా పోయాయి.

సాయంత్రమైతే ట్రాఫిక్ జామ్


జాతీయ రహదారిలో రోడ్డుకు ఇరువైపులా నిలిపిన టమోటా వాహనాలు

ములకలచెరువులో సాయంత్రమైతే భారీగా ట్రాఫిక్ స్తంభించిపోతోంది. మార్కెట్‌కు టమోటాలు తీసుకొస్తున్న వాహనాల్లోని కాయలను దించి తరువాత స్థలం చాలక బయటకు పంపుతున్నారు. దీంతో మార్కెట్ యార్డు సమీపంలోని ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలో వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలిపేస్తున్నారు. ప్రతిరోజూ మార్కెట్ యార్డు నుంచి బంగ్లా వరకు వాహనాలు రోడ్డుకు ఇరువైపులా బారులు తీరుతున్నాయి. దీంతో జాతీయ రహదారిలో రాకపోకలు సాగించే ఇతర వాహనాలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది.

వేగం చూస్తుంటే భయమేస్తోంది



మార్కెట్‌కు టమోటాలు తీసుకెళ్లే వాహనాల వేగం చూస్తుంటే భయమే స్తోంది. ఇటీవల మదనపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా టమోటాలు తీసుకెళ్తున్న ఐచర్ వాహనం వేగంగా కారు మీదకు వస్తుండగా డ్రైవర్ చాకచక్యంగా పక్కకు వచ్చేశాడు. లేదంటే ప్రమాదానికి గురయ్యేవాళ్లం. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని జాతీయ రహదారిలో వాహనాల వేగం నియంత్రణకు పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలి.

- వెంకటరమణ, ములకలచెరువు

సాయంత్రమైతే ట్రాఫిక్‌జామ్



ములకలచెరువులోని మార్కెట్‌యార్డు వద్ద జాతీయ రహదారిలో ప్రతిరోజూ ఇరువైపులా టమోటా వాహనాలు నిలుపుతుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. వాహనాలను ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా నిలిపేస్తున్నారు. రాత్రయితే ఏ ప్రమాదం జరుగుతుందోనని భయమేస్తోంది. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఆర్టీసీ బస్టాండు స్థలంలో వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలి.

- మతీన్‌బాషా, ములకలచెరువు

పైపులు, కేబుల్‌కు నిప్పు

పెద్దతిప్పసముద్రం జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్టేవాండ్లపల్లె పంచాయతీ పరిధిలోని కమ్మచెరువులో ఓ నిరుపేద కుటుంబీకుడు దార సోమశేఖర్ పొలం వద్ద కేబుల్ వైరు, పీవీసీ పైపులకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని గురువారం బాధితుడు పోలీసులకు పిర్యాదు చేశాడు. తమ గ్రామ శివారులో పొలంలో బోరువేసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించుకుంటుంటే బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వలన తమ పొలంలో అమర్చుకున్న పైపులు, బోరు మోటర్‌కు అమర్చిన విద్యుత్ కేబుల్ పూర్తిగా దగ్ధమైందన్నారు. సుమారు రూ 60 వేలు నష్టం వాటిల్లిందని క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న సుగుణ

బి.కొత్తకోట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్లపల్లెకు చెందిన వివాహిత సుగుణ (30) గురువారం ఉదయం క్రిమిసంహారిణి తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆరునెలల కిందట ఓ వ్యక్తి వద్ద అప్పుచేసి తీర్చలేకపోవడంతో అతను వేధించాడని, అవమానం భరించలేక, చేసిన అప్పు తీర్చలేక సుగుణ ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె మదనపల్లెలో చికిత్స పొందుతోంది. మిగతా వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

నంది వాహనంపై దర్శనమిచ్చిన సిద్ధేశ్వర స్వామి

రాజంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య ఇలవేల్పు దేవుళ్ల సిద్ధేశ్వర, చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం నందివాహనంపై సిద్ధేశ్వర, చెన్నకేశవస్వామి దర్శనమిచ్చారు. గురువారం సాయంత్రం తాళ్లపాక పురవీధుల్లో వాహన మండపాన్ని ప్రత్యేకంగా అలంకరించి నంది వాహనంపై చెన్నకేశవ సిద్ధేశ్వరస్వాములు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

రూ. 13 లక్షల విలువైన ఎర్రచందనం పట్టివేత


- రెండు వాహనాలు సీజ్... ఇద్దరు స్మగ్లర్ల అరెస్ట్


ఎర్రచందనం దుంగలతో పట్టుబడ్డ స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న దృశ్యం

పీలేరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల నుంచి అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న రూ.13 లక్షల విలువైన ఎర్రచందనం పట్టుకున్నట్లు పీలేరు ఫారెస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో గురుప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన పీలేరు ఫారెస్ట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పులిచెర్ల-కల్లూరు మార్గంలోని రైల్వే వంతెన వద్ద ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గురువారం తెల్లవారుజామున పులిచెర్ల నుంచి కల్లూరు వైపు అతివేగంగా టాటా ఇన్‌ట్రా వీ20 వాహనం వచ్చిందన్నారు. ఆ వాహనాన్ని ఆపి తనిఖీ చేస్తుండగా మరో టవేరా వాహనం వచ్చిందన్నారు.

ఇంతలోనే టవేరా వాహనంలోని ఒకరు వాహనం నుంచి దూకి చీకట్లోకి పారిపోయినట్లు తెలిపారు. అప్రమత్తమైన ఫారెస్ట్ అధికారులు ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. రెండు వాహనాలను తనిఖీ చేయగా అందులో సుమారు 200 కిలోల బరువు గల 8 ఎర్రచందనం దుంగలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. పట్టుబడిన ఎర్రచందనం, రెండు వాహనాలు, ఇద్దరు స్మగ్లర్లను పీలేరు ఫారెస్ట్ కార్యాలయానికి తరలించి విచారించగా ఇద్దరు స్మగ్లర్లు తిరుపతి బొమ్మగుంట ప్రాంతానికి చెందిన నరసింహులు, పవన్ కల్యాణ్‌గా గుర్తించామన్నారు. వీరు రుయా ఆస్పత్రిలో అంబులెన్స్ డ్రైవర్లుగా పనిచేస్తున్నట్లు విచారణలో వెలుగు చూసిందన్నారు. మరో ప్రధాన స్మగ్లర్ మల్లికార్జున పారిపోయినట్లు తెలిపారు. పారిపోయిన స్మగ్లర్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఆయన చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడిలో ఎఫ్‌ఆర్‌వో ఎస్.చంద్ర శేఖర్, ఎస్ఎస్‌ఓ కె.ప్రకాష్‌కుమార్, ఎఫ్‌బీఓలు కె.ప్రతాప్, పి.రెడ్డిప్రసాద్ ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

శాకాంబరి అలంకారంలో అమ్మవారు



రాయచోటిటౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం గురుపౌర్ణమి సందర్భంగా గురువారం పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళీ అమ్మవారు శాకాంబరి మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తదితర ఫలాలతో శాకాంబరీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. గురుపౌర్ణమిని పురష్కరించుకుని ఆలయంలో వ్యాస మహర్షి రేణుకాచార్యుల వారికి అర్చక స్వాములు భక్తులు కలిసి గురుపూజ కార్యక్రమాన్ని నిర్వహించి గురుపూజోత్సవ విశిష్టత గురించి తెలియజేశారు. స్థానికులతో పాటు కన్నడ భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ
చైర్‌పర్సన్‌గా వరలక్ష్మి

కలికిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్‌పర్సన్‌గా పగడాల వరలక్ష్మిని నియమించింది. స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్ గౌరవాధ్యక్షుడిగా చిన్నం శివయ్యను ఉపాధ్యక్షుడిగా నామినేట్ చేశారు. పాలకవర్గ సభ్యులుగా బచ్చు రామచంద్ర, ఎస్.బాలసుబ్రమణ్యం, సి.నాగేశ్వర రాజు, కనుపర్తి శంకరయ్య, కటికం సుబ్రమణ్యం, కాటూరి నరసింహులు, కేతు రజినీకాంత్‌రెడ్డి, ముత్యాల సురేఖ, గద్దె పెంచలయ్య, యమలా నాగేశ్వరి, నల్లంశెట్టి చిన్నయల్లయ్య, షేక్ మహబూబ్ బాషా, తుపాకుల పెంచలయ్యలను నియమించారు. ఇక చిట్వేలి సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జీని, కోడూరు వ్యవసాయ శాఖ ఏడీ, కె.బుడుగుంటపల్లె సర్పంచ్‌ను, జిల్లా మార్కెటింగ్ శాఖ డీఏటీ పదవుల రీత్యా నియమింపబడ్డారు.

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బంది సేవలందించాలని మార్గదర్శకులను, బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతంగా చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతిలోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పీ-4 కార్యక్రమం, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ, మలేరియా డెంగ్యూ తదితర వ్యాధుల వ్యాప్తి, తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనల మేరకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంక్షేమ శాఖల వారి పరిధిలో ఉన్న హాస్టళ్లను అన్నింటిని తనిఖీ చేసి నివేదికలను సమర్పించాలన్నారు. కమ్యూనిటీ శానిటేషన్ సెంటర్లకు సంబంధించిన వెంటనే చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖ ఎస్ఈ ప్రసన్నకుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రవేశం.. పరీక్షే.!

- గురుకులాల అధికారుల్లో సమన్వయలోపం
- విద్యార్థుల ప్రవేశాల్లో అయోమయం
- కార్యాలయాలు, కళాశాలల చుట్టూ జనం

(5వ పేజీ తరువాయి)

అంతా అయోమయంగా మారింది. ఈ క్రమంలో ఇటు కలెక్టర్ కార్యాలయం, అటు కళాశాలల చుట్టూ విద్యార్థులు, వా రి తల్లిదండ్రులు తిరుగుతున్నారు. సీట్ల భర్తీ విషయంలో అధికారుల సమన్వయ లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రెండు జిల్లాల్లో 23 గురుకులాలు

వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో 23 గురుకులాలు ఉన్నాయి. ఇందులో గండిక్షేత్రం, బ్రహ్మంగారిమఠం, సగిలేరు, పులివెందుల, బి.కొత్తకోట, రామాపురం, రైల్వేకోడూరు సాంఘిక సంక్షేమ గురుకులాలు బాలురకు నిర్వహిస్తున్నారు. బాలికలకు సంబంధించి చిన్నచౌకు, పులివెందుల, గుండ్లకుంట, మడకలవారిపల్లె, రాజుపాలెం, కొండాపురం, కమలాపురం, పీలేరు, బురకాయలకోట, మదనపల్లె, వాల్మీకిపురం, రాయచోటి, దేవపల్లె, ఆడపూరుతో పాటు లక్కిరెడ్డిపల్లెల్లో గురుకుల పాఠశాలలున్నాయి. ఇందులో 14,250 సీట్లకు గాను 13,395 సీట్లు విద్యార్థులకు కేటాయించామని ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యాలయ అధికార యంత్రాంగం పేర్కొంది. మిగిలిన 855 సీట్లకు ఈ నెల 15న కౌన్సెలింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

మహాగురుకులం వైపే అందరి నడక

వైఎస్సార్‌కడప జిల్లాలోని బ్రహ్మంగారిమఠంలో ఏర్పాటు చేసిన మహాగురుకులం వైపే విద్యార్థుల అడుగులు పడుతున్నాయి. చాలా గురుకులాల్లో మౌలిక వసతులు కొరవడడం, సక్రమంగా విద్యాబోధన జరగకపోవడంతో ప్రతి సంవత్సరం సీట్లు మిగిలిపోతూ వచ్చాయి. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, కలెక్టర్ శ్రీధర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని మహాగురుకులంలో ఆధునాతన వసతులు కల్పించడంతో పాటు సీట్ల భర్తీకి విరివిగా ప్రచారం జరగడంతో ఎక్కువమంది అందులో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు.

దీంతో ఈ గురుకులంలో ఇప్పటికే సీట్లు భర్తీ అయిపోయాయని అంటున్నారు. అయితే పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా కాకుండా ప్రిన్సిపాల్, సిబ్బంది ఇష్టానుసారంగా ప్రవేశాలు కల్పించడంతో చాలామంది మెరిట్ విద్యార్థులు నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది. రోస్టర్ ప్రకారం కొన్ని కులాల సీట్లు మిగిలి పోయాయని వీటిని అదే కేటగిరీలో వేరే కులాల వారికి కేటాయించాలని కొందరు కోరుతున్నారు. దీనిపై కలెక్టర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సీటు అయితే ఎక్కడో చోట లభ్యమవుతుంది. ఇంటర్మీడియట్‌కు సంబంధించి సీట్లు ఎక్కడ ఉన్నాయనేది పరిశీలిస్తున్నాం. బ్రహ్మంగారిమఠం మహాగురుకులంలో దాదాపు అడ్మిషన్లు పూర్తయ్యాయి. పాఠశాల విద్యకు సంబంధించి సీట్లు అలాట్ చేసిన జాబితా కూడా కార్యాలయంలో అందుబాటులో ఉంచాం.

- ఉదయశ్రీ, గురుకుల విద్యాలయాల సమన్వయ అధికారి

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ వెంకటేశ్వర్లు

రాయచోటిటౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను తెలుసుకోవడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల పర్యటన చేస్తున్న ఆయన గురువారం ఉమ్మడి కడప జిల్లాకు వచ్చిన సందర్భంగా రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం సానుకూలంగానే ఉందని, ఉద్యోగులు కూడా అదే స్థాయిలో ఉన్నారని చెప్పారు. అయితే గత ప్రభుత్వం 12వ పీఆర్‌సీని అమలు చేస్తానని చెప్పి అమలు చేయలేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్‌సీ అమలు చేస్తానని చెప్పినా ఇంతవరకు అమలు చేయలేదని, పీఆర్‌సీ కమిటీని వేయకుండా కాలయాపన చేస్తుండడంతో ఉద్యోగుల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేక భావన పెరుగుతోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం పీఆర్‌సీని అమలు చేసిందని, ఇక్కడ కూడా వెంటనే పీఆర్సీని అమలు చేసి ఉద్యోగుల్లో వ్యతిరేక భావనలు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి నేతలు నరసింహాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



చిన్నమండెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై మల్లూరు క్రాస్ వద్ద గురువారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో శెట్టిపల్లి కొండారెడ్డికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చిన్నమండెం మండలం కొత్తపల్లికి చెందిన శెట్టిపల్లి కొండారెడ్డి ద్విచక్రవాహనంలో తమ ఊరు నుండి మల్లూరు రూల్ వెళ్లాల్సి ఉండగా మల్లూరు క్రాస్ వద్దకు రాగానే క్రాస్ వద్దకు రాగానే వెనుక వైపునుంచి వస్తున్న కారు ఢీకొన టడంతో కొండారెడ్డికి కాళ్లు చేతికి తీవ్ర గాయమైనట్లు స్థానికులు తెలిపారు. వెంటనే అతన్ని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కొర్రపాడు రోడ్డు విస్తరణకు మోక్షం ఎప్పుడో..!


విస్తరించాల్సిన కొర్రపాడు రోడ్డు

- కట్టడాల తొలగింపునకు రూ.13 కోట్లు
- భూసేకరణకు రూ.44 కోట్లు
- రోడ్డు నిర్మాణానికి రూ.18 కోట్లు
- నిధుల మంజూరుకు ఎమ్మెల్యే యత్నం

ప్రొద్దుటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రధాన రోడ్ల విస్తరణ జరగాల్సి వుంది. పట్టణంలోని నాలుగు దిక్కుల నాలుగు ప్రధాన రహదారులు వున్నాయి. మైదుకూరు రోడ్డు, కొర్రపాడు రోడ్డు, జమ్మలమడుగు రోడ్డు, ఎర్రగుంట్ల రోడ్లు వున్నాయి. వీటిని మాస్టర్‌ప్లాన్ రోడ్ల విస్తరణలో చేర్చినప్పటికీ ఇప్పటికి కేవలం మైదుకూరు రోడ్డు మాత్రమే 100 అడుగుల విస్తీర్ణంతో కొంత శాతం మేర విస్త రణ జరిగింది. ఇంకా పూర్తి స్థాయిలో మున్సిపాలిటీ లిమిట్స్‌లో జరగాల్సి వుంది. ఇందుకు కొందరు భవన యజమానులు కోర్టుకు వెళ్లడంతో మైదుకూరు రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయి. అయితే కొర్రపాడు రోడ్డు విస్తరణ పనులను గత టీడీపీ ప్రభుత్వం మొదలు పెట్టిన తరువాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఆ పనులు ఆగిపోయాయి. తిరిగి కూటమి ప్రభుత్వం రావడంతో కొర్రపాడు రోడ్డు విస్తరణ పనులను చేపట్టడానికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మళ్లీ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా అయిన ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణను సైతం కలిసి నిధులు మంజూరు చేయాలని కోరారు.

వంద అడుగుల విస్తరణ

మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆధ్వర్యంలో కొర్రపాడు రోడ్డును 100 అడుగుల మేర విస్త రణకు భవనాలకు మార్కింగ్ వేశారు. దాదాపు 85 కట్టడాలను గుర్తించారు. వీటిని తొలగించాలంటే భవన యజమానులకు పరిహారంగా దాదాపు రూ.13 కోట్లు చెల్లించాల్సి వుంటుందని మార్కెట్ వాల్యూ ప్రకారం అంచనా వేశారు. అలాగే రోడ్డు విస్తరణకు భూమిని కోల్పోయే వారికి నష్టపరిహారంగా దాదాపు రూ.44కోట్ల మేర చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేశారు.

నిధులు విడుదలైతే పనులు ప్రారంభం

కొర్రపాడు రోడ్డు విస్తరణలో కట్టడాల తొలగింపు చేపట్టాలంటే భవన యజమానులకు రూ.13కోట్ల మేర నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుంది. ఆ నిధులు విడుదల కాగానే కట్టడాలు తొలగింపు పనులు చేపడతాం. రోడ్డు విస్తరణకు భూమి కోల్పోయే బాధితులకు ప్రభుత్వం టీడీఆర్ బాండ్లు జారీ చేస్తుంది. రోడ్డు నిర్మాణ పనుల కోసం ఆర్‌అండ్‌బీ ఇచ్చిన రూ.5.85 కోట్ల నిధులతో పనులు మొదలు పెడతారు.
-చింతా రవిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు.

రూ.44కోట్లకు టీడీఆర్ బాండ్లు

భూసేకరణకు మాత్రం టీడీఆర్ బాండ్లను జారీ చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. కానీ భూమి కోల్పోయే బాధితులు మాత్రం తమకు టీడీఆర్ బాండ్లు వద్దని.. నష్టపరిహా రం నగదు రూపంలోనే కావాలని కోరుతున్నారు. అయితే కొందరు మాత్రం టీడీఆర్ బాండ్లకైనా ముందుకు వచ్చారు. మరికొందరు పేదలు ముఖ్యంగా ఎర్రన్న కొట్టాలకు చెందిన ఎస్సీలు తమ ఇళ్లు పోతే తాము ఎక్కడ జీవించాలని.. ఎటువంటి పరిస్థితిలో అంగీకరించమని చెబుతున్నారు. అయితే పేదల ఇళ్ల నిర్మాణాలు తొలగిస్తే వాటికి నష్టపరిహారంతో పాటు ప్రభుత్వం ఉచితంగా రెండు సెంట్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణా నికి రుణం కూడా అందజేస్తుందని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సంబంధింత ఎస్సీల పెద్దలతో చర్చించి హామీ ఇచ్చారు.

రూ.5.85 కోట్లు నిధులు విడుదల

కొర్రపాడు రోడ్డు నిర్మాణానికి సంబంధించి రూ.5.85 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఆర్‌అండ్‌బీశాఖ నుంచి జీవో ఎంఎస్ నెం 151ను 29.3.2025న ప్రభుత్వం విడుదల చేసింది. అయితే 1.97 కిమీటర్ల మేర చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు ఈ నిధులు ఏ మాత్రం సరిపోవు. ఈ రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్స్ షిఫ్టింగ్ పనులకు, రోడ్డుకు ఇరువైపుల కాలువల నిర్మాణానికి, ఫుట్ పాత్ ఏర్పాటుకు రోడ్డు మధ్య డివైడర్లు, మొక్కల ఏర్పాటుతో పాటు బ్యూటిఫికేషన్, ఎలక్ట్రిఫికేషన్ పనులకు కలిపి దాదాపు మరో రూ.12 కోట్లు కావాల్సి వస్తుందని అంచనా వేశారు. ఈ రూ.12కోట్ల నిధుల మంజూరు కోసం గత ఏడాది డిసెంబరులోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపా రు. ఈ నిధులు ఆర్‌అండ్‌బీ మంజూరు చేస్తే పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ఇక కట్టడాల తొలగింపు పరిహారం రూ.13కోట్ల విడుదలైతే రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతాయి. అయితే మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్‌శాఖ ఈ నిధులు విడుదల చేయాల్సి వుంది. ఆమేరకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణను కలిసి విన్నవించారు. ఈ నిధులకు మోక్షం లభించి నట్లయితే కొర్రపాడు రోడ్డు విస్తరణ జరిగి ప్రొద్దుటూరు అభివృద్ధి గాడిన పడినట్లవుతుంది.

ఆర్కిటెక్చర్ విద్యార్థుల సమస్యకు త్వరలో పరిష్కారం : మంత్రి లోకేశ్


మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు, చిత్రంలో ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆర్కిటెక్చర్ విద్యార్థుల సమస్యకు త్వరలో పరిష్కారం చూపుతామని.. ఎలాంటి ఆందోళన చెందవద్దని రాష్ట్ర ఐటీ విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ అన్నారు. గురువారం సత్యసాయి జిల్లాలో నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమలాపురం ఎమ్మెల్యే పుత్తాచైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆర్కిటెక్చర్ విద్యార్థులు లోకేశ్‌ను కలిశారు. యూనివర్సిటీలో గుర్తింపు విషయమై తాము ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రికి విన్నవించారు. అందుకు లోకేశ్ సానుకూలంగా స్పందించి చదువు కునే బాధ్యత మీది... సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. అన్ని విషయాలను కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌తో చర్చిస్తామని.. విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగనివ్వమని స్పష్టం చేశారు. దీంతో విద్యార్థులు మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించాలి

కడప రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంపై కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి తెలిపారు. గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలను అందజేస్తున్నారన్నారు. అలాగే కడప ఆర్టీసీ బస్టాండ్, కలెక్టరేట్ కార్యాలయం, రైల్వేస్టేషన్, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ప్లెక్సీలను, బ్యానర్లను ప్రదర్శించామని తెలిపారు.

ప్రతి కార్యకర్త ధైర్యంగా ఉండండి : ఎంపీ

పులివెందుల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలందరు ధైర్యంగా ఉండాలని.. ఎటువంటి ఇబ్బందులకు గురిచేసిన ధైర్యాన్ని కోల్పోవద్దని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వైఎస్సార్ ఆడిటో రియంలో పులివెందుల నియోజక వర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పడ్డప్పటి నుంచి అరాచకపాలన సాగుతోందన్నారు. కానీ ఎవరు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. అందరికి వైసీపీ అండగా ఉంటుందన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం

- కాలిపోయిన వస్తువులు, నగదు


కాలి బూడిదైన వస్తువులు

ఎర్రగుంట్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిలమకూరులో గురువారం మధ్యాహ్నం ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లోని వస్తువులు, నగదు కాలి బూడిదయ్యాయి. బాధితుల వివరాల మేరకు.. చిలమకూరుకు చెందిన తలారి చలమయ్య ఇంటిలో ఎవరూ లేని సమ యంలో గురువారం మధ్యాహ్నం 12గంటల సమయంలో షార్టు సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో ఇంట్లోని వంటసామగ్రితో పాటు, వస్తువులు, రూ.30వేలు నగదు మంటల్లో కాలిపోయినట్లు వాపోయారు. అధికారులు తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

రైలుకింద పడి హమాలీ ఆత్మహత్య



ఎర్రగుంట్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రైలుకింద పడి ఆవుల క్రిష్ణయ్య (64) అనే హమాలీ ఆత్మ హ్యత చేసుకున్నాడు. స్థానిక ముద్దనూరు రోడ్డులోని టౌన్ బ్యాంకు వెనుక వైపు నివాసం ఉంటున్న క్రిష్ణయ్యకు గత కొంత కాలంగా ఆరోగ్యం సరిగా లేదు. గురువారం గూడ్సు రైలుకింద పడి ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డా డు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం



కడప క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ప్రకాశ్‌నగర్ చెందిన సురభి లక్ష్మి దేవి అనే వివాహిత కనిపించడం లేదని ఆమె భర్త సురభి నాగ ప్రసాద్ చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. సురభి లక్ష్మీదేవి నగరంలోని మాంగళ్య షాపింగ్‌మాల్‌లో పనిచేస్తోంది. 8వ తేదీ మధ్యాహ్నం సుమారు 12.40కి తన తల్లి ఊరైన లక్కి రెడ్డిపల్లె మండలం కస్తూరిరాజుపల్లె వద్ద గల మాదిగపల్లె పోయి వస్తానని చెప్పి వెళ్లింది. అయితే అక్కడకు ఫోను చేయగా రాలేదని తెలిసింది. బంధు వుల ఇళ్లల్లో విచారించగా ఆచూకీ తెలియలేదు. ఈ మేరకు గురువారం ఆమె భర్త చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి



కడప క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రైల్వేస్టేషన్ పార్కింగ్ స్థలం వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు కడప వన్‌టౌన్ ఎస్ఐ అమర్ నాధ రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు మృతి చెంది న వ్యక్తి వయస్సు 45 నుంచి 48 వరకు ఉంటుందన్నారు. రెండు రోజులుగా రైల్వేస్టేషన్ సమీపంలోని పార్కింగ్ స్థలం వద్ద ఉంటున్నాడని, అయితే అతిగా మద్యం తాగడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లి మృతి చెందిషట్లు తెలిపారు. మృతుడి పూర్తి వివరాలకు 9121100510కు ఫోనుచేసి మరింత సమాచారం తెలుసుకోవ చ్చని కోరారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

చక్రాయపేట,జూలై 10 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానం సమీపంలో గురువారం వేరుశనగ చెత్తను ట్రాక్టర్ తీసుకొస్తుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభం విరిగిపడి వేరుశనగ చెత్తపై తీగలు పడ్డాయి. ఆ సమయంలో కరెంటులేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.

ఆరోగ్య కేంద్రానికి మెడిసిన్ తెప్పించాలి


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వెంటనే మెడిసిన్ అందుబాటులోకి తీసుకురావాలని టీఎన్ఎస్ఎఫ్ వైవీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం వైవీయూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. హెల్త్ సెంటర్‌లో గత కొంతకాలంగా మందులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. తక్షణం మెడిసిన్ తీసుకురావాలని నినాదాలు చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనవాసులు, హెల్త్ సెంటర్ వద్దకు చేరుకోగా.. విద్యార్థులు వారికి వనతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ వైవీయూ అధ్యక్షుడు భరత్‌సింహ, నాయకులు కిషోర్, గంగన్న, రంజిత్, గౌస్, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నమయ్య కాలిబాటలో భక్తులను అడ్డుకున్న పోలీసులు

- అడవి నుంచి కుక్కలదొడ్డి ప్రధాన దారికి తరలింపు


అన్నమయ్య కాలిబాటలో వెళుతున్న భక్తులను వెనక్కు పంపిస్తున్న ఏఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే

రైల్వేకోడూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య కాలిబాటలో గురువారం తిరుమలకు వెళుతున్న భక్తులను అటవీ శాఖ, పోలీసు అధికారులు అడ్డుకున్నారు. చాలా మంది అడవిలో ఉండడంతో రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే, జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్‌సింగ్, రైల్వేకోడూరు సీఐలు హేమసుదరరావు, వెంకటేశ్వర్లు, రైల్వేకోడూరు రేంజర్ శ్యాంసుందర్, బాలపల్లె డీఆర్‌వో బాలచంద్రుడు తదితర సిబ్బంది సమాచారం అందుకుని హుటాహుటిన అడవిలోకి వెళ్లి భక్తులను అక్కడి నుంచి కుక్కలదొడ్డి ప్రధాన దారికి పంపించారు. అనంతరం రోడ్డు మార్గం గుండా తిరుమలకు వెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలోని పెద్దచెప్పలి తదితర ప్రాంతాల నుంచి ఆదివారం తిరుమల పాదయాత్ర ను ప్రభాకర్‌రెడ్డి అనే భక్తుడు సుమారు 900 మందితో ప్రారంభించారు. పాదయాత్ర గురువారం ఉదయానికి కుక్కలదొడ్డికి చేరుకుంది. ఈ విషయం తెలుసుకున్న అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటూ అడవిలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. ఏనుగులు ఉన్నాయని హెచ్చరించి వెనక్కి పంపించారు. కాగా కొందరు అధికారుల కళ్లుగప్పి వెళుతున్న భక్తులను కూడా కుక్కలదొడ్డి ప్రధాన దారి వద్దకు తరలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ శెట్టిగుంట, కుక్కలదొడ్డి, రేణిగుంట మండలంలోని మామండూరు నుంచి తిరుమలకు అటవీ మార్గంలో ప్రస్తుతం 65 ఏనుగులు సంచరిస్తున్నాయని తెలిపారు. కొన్ని రోజులుగా పిల్లలతో ఉన్న ఏనుగుల మంద తరచుగా సంచరిస్తున్నట్లు తెలిపారు. దీంతో కుక్కలదొడ్డి నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళ్లడం శ్రేయస్కరం కాదన్నారు.

తిరుమల కాలిబాటకు ప్రవేశం రద్దు : సబ్‌కలెక్టర్

రాజంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట, కుక్కలదొడ్డి మార్గంలో ఏనుగుల సంచారం ఉన్నందున ఈ ప్రాంతంలో తిరుమలకు వెళ్లే భక్తులకు పాదయాత్రను రద్దు చేస్తున్నట్లు రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని రోజులుగా పిల్లలతో ఏనుగుల మంద తిరుగుతోందన్నారు. ఈ ఏనుగుల మంద స్వరూపం చాలా భీకరంగా ఉంటుందని, ఇవి దాడులకు పాల్పడి ప్రాణహాని చేసే అవకాశం ఉందని, ఈ మార్గంలో ఎవరూ వెళ్లడానికి వీలులేదన్నారు. ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా కుక్కలదొడ్డి నుంచి తిరుమల వెళ్లే కాలిబాటలో పాద్రయాతను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా భద్రత దృష్ట్యా ఏనుగుల దాడి నుంచి ప్రజలను రక్షించడానికి ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కావున భక్తులు సహకరించి ఈ మార్గంలో వెళ్లకుండా ఇతర మార్గాల్లో తిరుమలకు వెళ్లాలని తెలిపారు.

ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం

- కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సంఘం సంపూర్ణ సహకారం
- రిటైర్డ్ జిల్లా కలెక్టర్ కె.ప్రభాకర్‌రెడ్డి



ఉత్తమ విద్యార్థులను గోల్డ్ మెడల్, సర్టిఫికెట్లతో సత్కరించిన పూర్వ విద్యార్థి, రిటైర్డ్ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సంఘం ఇతోధికంగా కృషి చేస్తుందని రిటైర్డ్ కృష్ణా జిల్లా కలెక్టర్ కె.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాల వ్యవస్థాపక దినోత్సవం ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అధ్యక్షతన ఘనంగా నిర్వ హించారు. కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు కలిసి కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సహ కారంతో చేసిన ఈ కార్యక్రమంలో 2024-25 విద్యా సంవత్సరం లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినీ, విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. అలాగే కళాశాలలో పనిచేసిన పూర్వ గురువులను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బంగారుపతకాలు అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం బాధ్యులు ఆచార్య పుత్తా రాజశేఖరరెడ్డి, డాక్టర్ ఎంసీ వెంకటసుబ్బయ్య, టీవీ సుబ్బారెడ్డి, సీపీడీసీ సభ్యులు చిన్నప రెడ్డి హాజరై ప్రసగించారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి డాక్టర్ శివరామ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కడప, అనంతపురం మ్యాచ్ డ్రా

- కర్నూలుపై చిత్తూరు జట్టు ఘన విజయం

కడప స్పోర్ట్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్ 19 మెన్స్ మల్టీ డే (మూడు రోజుల) క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం రెండు వేర్వేరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో కడప, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. అలాగే కర్నూలు, చిత్తూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్ లో చిత్తూరు జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

కేవోఆర్ఎం మైదానంలో...

కడప నగర శివారు ప్రాంతం కేవోఆర్ఎం మైదానంలో కడప, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన కడప జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 93.2 ఓవర్లలో 495 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తదుపరి బ్యాటింగ్ దిగిన అనంతపురం జట్టు 67 ఓవర్లలో 250 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. దీంతో కడప జట్టుకు 245 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 107 ఓవర్లలో 9 వికెట్లను కోల్పోయి 455 పరుగులు చేసింది. ఇందులో రోహిత్ వర్మ 133, ఆర్జిత్‌రెడ్డి 111 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో నిర్వాహకులు మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

ఏసీఏ మైదానంలో

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదట కర్నూలు జట్టు బ్యాటింగ్ చేపట్టి తన మొదటి ఇన్నింగ్స్‌లో 77.4 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌట్ కాగా, తదుపరి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 63.4 ఓవర్లలో 251 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో కర్నూలు జట్టుకు 31 పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం రెండోరోజు కర్నూలు జట్టు 71.2 ఓవర్లలో 272 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో మొత్తం రెండు ఇన్నింగ్స్‌లకు కలిపి 303 పరుగులు ఆధిక్యత సాధించింది. ఇందులో హృదయ్ 85, విఖ్యాత్ 85 పరుగులు చేశారు. అనంతరం మూడోరోజు గురువారం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు 42.2 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయానికి అవసరమైన 304 పరుగులు సాధించి జయకేతనం ఎగురవేశారు. ఇందులో లోహిత్ లక్ష్మినారాయణ 138 పరుగులు సాధించారు. దీంతో చిత్తూరు జట్టు 7 వికెట్ల తేడాతో విజయభేరి మోగించింది.



రోహిత్ వర్మ, ఆర్జిత్‌రెడ్డి, లోహిత్ లక్ష్మినారాయణ

సచివాలయ ఉద్యోగిని ఆత్మహత్య


మృతురాలు రాజేశ్వరి (ఫైల్ ఫొటో)

రైల్వేకోడూరు రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లి మండలంలోని బలిరెడ్డిపల్లి సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సూర్య రాజేశ్వరి(32) కోడూరు పట్టణంలో తన నివాసంలో ఉరేసుకుని మృతిచెందింది. పోలీసుల వివరాల మేరకు.. ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరానికి చెందిన మృతురాలు రాజేశ్వరి 2019 సంవత్సరంలో బాలిరెడ్డిపల్లి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరింది. కోడూరు పట్టణంలోని ప్రధాన రహదారి పాత బస్టాండ్ గంగమ్మ గుడి ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. గురువారం ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా ఇంట్లో ఉరేసుకుని మృతిచెందింది. వెంటనే మృతదేహన్ని శవపరీక్ష నిమిత్తం కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ కె.హేమసుందర్ తెలిపారు. ఇటీవల తండ్రి మరణించడం, చెల్లెలు భర్త కూడా ఇటీవల మృతి చెందడంతో తీవ్ర మనస్థాపానికి గురైంది. ఇటీవల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆమె సుండుపల్లి మండలంలోని సొంటంవారిపల్లి గ్రామ పంచాయతీకి బదిలీ అయింది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని, మృతురాలి తల్లి రవణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా రైల్వేకోడూరు జనసేన పార్టీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్.. రాజేశ్వరి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకుని ప్రభు త్వ ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుం బ సభ్యులను పరామర్శించి ఆమె మృతికి కారణాలపై ఆరా తీశారు. బాధితురాలి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సమగ్ర దర్యాప్తు చేయాలి : కలెక్టర్

రాజేశ్వరి మృతి పట్ల కలెక్టర్ శ్రీధర్ స్పందించారు. మృతికిగల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని రాజంపేట సబ్ కలెక్టర్, పోలీస్‌శాఖ అధికారులను ఆదేశించారు.

స్థానికేతర వర్గీకరణతో విద్యార్థులకు తీవ్రనష్టం

కడప ఎడ్యుకేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోత): ఉన్నత విద్యా ప్రవేశ పరీక్షల్లో స్థానికేతర వర్గీకరణ వల్ల విద్యార్థులకు తీవ్రనష్టం వాటిల్లుతోందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక రాష్ట్రంలో చదువుకునే విద్యార్థులను కేవలం వారి నివాస ప్రాతిపదికన వర్గీకరించడం వల్ల అవకాశాలలో అసమానతలు ఏర్పడుతున్నాయని, ప్రభుత్వం దీనిపై దృష్టిసారించి స్థానికేతర విద్యార్థులకు నష్టం కలుగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యను సవాలుగా తీసుకున్న లోకేష్

- రెండేళ్లలో కనబడనున్న సంస్కరణ ఫలితాలు ● ప్రైవేటు స్కూళ్ల నుంచి వలసలు తప్పవు ● ఎమ్మెల్యేలు నల్లారి, షాజహాన్ బాష
- పాఠశాల పండుగ విద్యా విప్లవానికి నాంది ● మెగా పేరెంట్స్ డేలో తల్లులకు పాదపూజ చేసిన విద్యార్థినీ, విద్యార్థులు



మెగా పేరెంట్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి - మదనపల్లె జడ్పీహైస్కూల్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా - ములకలచెరువులో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

విద్యను టీడీపీ ప్రభుత్వం సవాలుగా తీసుకుందని, విద్యామంత్రి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, రానున్న రెండేళ్లలో సంస్కరణ ఫలితాలు కనబడతాయని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం 2.0ను గురువారం వేడుకగా నిర్వహించారు. చదువు అందరి బాధ్యత అని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. పాఠశాల పండగ విద్యా విప్లవానికి నాంది పలికిందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. సమావేశంలో విద్యార్థినులు తమ తల్లులకు పాదపూజలు చేశారు. అనంతరం 'ఏక్ పేడ్ మాకే నామ్' అంటూ తల్లి పేరుతో మొక్కలను నాటారు. కొన్ని పాఠశాలల్లో అత్య ధిక మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు విందును ఏర్పాటు చేశారు. వివరాల్లోకెళితే...

కలికిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఏడాదిలోనే ప్రభుత్వ బడుల్లో మార్పులు కనబడుతున్నాయని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి అన్నారు. మరో రెండేళ్లలో ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వలసలు పెరుగుతాయని, ఇప్పటికే సంస్కరణల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రైవేటు స్కూళ్లలో చదవించడమే ఒక సామాజిక హోదాగా పరిగణించి తల్లిదండ్రులు ఆత్మన్యూనతా భావంతో వున్నారన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, మాజీ సర్పంచు లక్ష్మీకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మాలతి, ఉపాధ్యక్షుడు సనావుల్లా, మండల ప్రత్యేక అధికారి డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, డీఫైఈఓ లోకేష్ రెడ్డి, ఎంపీడీఓ భానుమూర్తి రావు, ఎంఈఓ కరీముల్లా, హెచ్‌ఎం జయమ్మ, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షురాలు జ్యోతి, సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, మాజీ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, పంచాయతీ కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డి, నేతలు వైజాగ్ బాషా, అగస్త్యేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

వాల్మీకిపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కష్టాలను ఎరిగి క్రమశిక్షణతో చదువుతూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రత్యేక అధికారి లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ పామిలేటి, ఎంపీడీఓ మనోహర్‌రాజు, డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, హెచ్‌ఎంలు, నేతలు, అధ్యా పకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్పొరేట్ తరహా విద్యాబోధన

పీలేరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కార్పొరేట్ తరహా విద్యాబోధన అందిస్తున్నట్లు పీలేరు మండల టీడీపీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, జూని యర్ కళాశాలలు, టీచర్స్ సమావేశం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శివకుమారి, ఏఎంసీ చైర్మెన్ పురం రామ్మూర్తి, మాజీ అధ్యక్షుడు ఎన్. అమరనాధ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గోళ్ల కిషోర్ నాయుడు, పట్టణ అధ్యక్షుడు కంచి సూరి, సుభాష్, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

గుర్రంకొండ, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తహసీల్దార్ లక్ష్మీప్రసన్న అన్నారు. పీటీఎం కార్యక్రమాన్ని పాఠశాల్లో ఘనంగా నిర్వహించారు. జడ్పీ హైస్కూల్ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య ప్రభుత్వ పాఠశాల్లో లభిస్తుందన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చరిత్రలో మలుపురాయి

కలకడ, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' చరిత్రలో మలుపురాయి వంటిదని టీడీపీ నేతలు అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలో మెగా పీటీఎంను పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఎర్రకోటపల్లె ఆస్పత్రి డాక్టర్ జవహర్‌బాబు, పీఏసీఎస్ చైర్మెన్ వెంకటరమణనాయుడు, తహసీల్దార్ మహేశ్వరిబాయి, ఎస్‌ఐ రామాంజనేయులు, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చదువు అందరి బాధ్యత

మదనపల్లె అర్బన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చదువు అందరి బాధ్యత అని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చితే ఉన్నత స్థానాలకు వారు వెళతారన్నారు. హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు రమణ, విద్యార్థిని, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యా విప్లవానికి నాంది

ములకలచెరువు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పీటీఎం 2.0 పండగ విద్యా విప్లవానికి నాంది పలికిందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. స్థానిక మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం మొక్కలు పంపిణీ చేసి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, ఎంపీడీఓ హరినారాయణ, తహసీల్దార్ ప్రదీప్, ఎంఈఓ వెంకటరమణ, టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ కేవీ రమణ, ప్రిన్సిపాల్ కవిత పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ విద్య

తంబళ్లపల్లె, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందుతోందని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. తంబళ్లపల్లె హైస్కూల్ సమావేశంలో ఆయన తల్లితండ్రులు, ఉపాధ్యాయులతో చర్చించారు. టెన్త్‌లో 500 పైగా మార్కులు తెచ్చుకున్న ఐదుగురు విద్యార్థులను అభినందించి ప్రోత్సాహక బహుమతిని ప్రకటించారు. అనంతరం విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. హెచ్‌ఎం శ్రీనివాసులు, ఎస్‌ఎంసీ చైర్మెన్ శివకుమార్, ప్రత్యేకాధికారి అమర్‌నాథ రెడ్డి, ఎంపీడీఓ థామస్‌రాజు, ఎంఈఓ త్యాగరాజు, ఏపీఓ అంజనప్ప, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అట్టహాసంగా మెగా పేరెంట్స్ డే

నిమ్మనపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని 63ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్ డే నిర్వహించారు. ఎంఈఓ-1 పద్మావతి, ఎంపీడీఓ రమేష్ మాట్లాడారు. అనంతరం తల్లిదండ్రులకు పలు పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీధర్, మునివెంకటమ్మ, ఉపాధ్యాయులు బాస్కరన్, సుధాకర్ గోపాల్, ఎస్‌ఐ తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమమే ధ్యేయం

కురబలకోట, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో మీటింగ్ నిర్వహించారు. ఎంపీపీ భూదేవి, తహసీల్దార్ ధనంజయలు, ఎంపీడీఓ గంగయ్య, ఏపీఓ సుబ్రమణ్యం, సురేంద్ర, అయూబ్ బాషా, మోహన్ రెడ్డి, ఎస్‌ఐ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులే తొలి గురువులు

రామసముద్రం, జూలై 10(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులే విద్యార్థులకు తొలి గురువులు అని పిల్లల క్రమశిక్షణ బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందని ఎంపీడీఓ గఫూర్ అన్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు.

పెద్దతిప్పసముద్రంలో...

పెద్దతిప్పసముద్రం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్రే కీలకమని మండల ప్రత్యేక అధికారి భరత్‌కుమార్ వెల్లడించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఎంఈఓ నారాయణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ఏక్ పేడ్ మాకేనాం

బి.కొత్తకోట, జూలై10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ మండల వ్యాప్తంగా నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి నీలకంఠేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో పట్టణంలోని జూనియర్ కాలేజిలు, మండలంలోని అన్ని జడ్పీహైస్కూళ్లలో పేరంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఏక్ పేడ్ మాకేనాంలో భాగంగా విద్యార్థులకు మొక్కలు, గ్రీన్‌పాస్‌పోర్ట్‌ను పంపిణీ చేశారు. మునిసిపల్ కమీషనర్ జీవీపల్లవి, ఏఎస్‌ఐ కరీముల్లా, ఎంఈఓలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి, పలువురు హెచ్‌ఎంలు, పాఠశాల కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

పెద్దమండ్యం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి, దురలవాట్లకు దూరంగా ఉండాలని ములకలచెరవు సీఐ లక్ష్మన్న పిలుపు నిచ్చారు. పెద్దమండ్యం మోడల్‌స్కూల్, కాలేజీలో జరిగిన పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కలిచెర్ల జూనియర్ కాలేజీ సహా అన్ని పాఠశాలల్లో పీటీఎంలు జరిగాయి. విద్యాశాఖధికారులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల కమిటీ చెర్మన్, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధించాలి


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్

పెద్దమండ్యం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి సాధించాలని పెద్దమండ్యం ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్ పిలుపు నిచ్చారు. మండల సమావేశంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు వెంటనే సర్పంచులకు, అధికారులకు ప్రజలు తెలియజేయాలన్నారు. పీఆర్ ఇన్‌చార్జ్ ఏఈ షావాజ్ బాష మాట్లాడుతూ ప్రభుత్వం పల్లె పండుగ 2వ విడతలో 24 అభివృద్ధి పనులకు రూ. 1 కోటి 7 లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. తహసీల్దార్ తేజశ్వి మాట్లాడుతూ పక్కాగృహ నిర్మాణాలకు నిబంధనలు ప్రకారం సకాలంలో పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి పైపులైన్‌లకు 13 పనులకు 57 లక్షలు, 13 కమ్యూనిటీ సోప్‌పిట్‌లకు రూ.910000 సచివాయల 11 మరుగుదొడ్ల నిర్మాణా లకు రూ. 33 లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. మండలంలో వాటర్‌షెడ్ అభివృద్ధి పనులకు మంజూరైన రూ. 7 కోట్ల నిధులు సకాలంలో సద్వినియోగం చేయాలని వాటర్‌షెడ్ కమిటీలను పీఓ రవీంద్రుడు కోరారు. విద్యుత్తు స్థంభాల ఏర్పాటు కోసం విలువైన చెట్లను నరికేస్తున్నారని చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ రామూర్తినాయక్‌ను సభ్యులు కోరారు. డీడీలు చెల్లించిన రైతులకు సీరియల్ ప్రకారం విద్యుత్తు పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఈ తెలిపారు. పశు వైద్యాధికారి ఉస్మాన్, హౌసింగ్ ఏఈ అక్రం, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ మురళీధర్, ఏపీఓ సురేంద్రారెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులు సిద్దవరం ప్రసాద్, గంగాధర, యుగంధర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర, వైఎస్ ఎంపీపీలు జయచంద్రారెడ్డి, శారద, మండల కోఆప్షన్ ఖాదర్‌వలీ, ఏపీఎం నరసింహులు, సర్పంచులు, ఎంపీటీసీ, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

'మామిడి రైతులకు వైసీపీ ఏమి చేసింది ?'


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మామిడి రైతులు కష్టాల్లో వుంటే కనీసం పలకరించను కూడా లేదు, ఇప్పుడు మామిడి రైతుల పరామర్శ పేరిట వైసీపీ అధ్యక్షుడు జగన్ వచ్చి బంగారుపాళ్యంలో డ్రామాలు ఆడారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ధ్వజమెత్తారు. స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో మామిడి రైతులను పరామర్శించే పేరిట వచ్చిన జగన్ పోలీసు ఆంక్షలను ఉల్లంఘించారన్నారు. రైతులను పరామర్శించేది పోయి పోలీసులపై దండయాత్రలాగా వ్యవహరించారన్నారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ గుండాలు దాడి చేస్తే అక్కడే వున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, విజయానందరెడ్డి పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ నేతలు మల్లికార్జున, గండికోట గణేష్‌బాబు, మనోహర్‌రెడ్డి, భాస్కర్, విద్యాసాగర్, హరి, భద్ర తదితరులు పాల్గొన్నారు.

హర్ష టయోటా ఎక్ఛేంజ్ మేళా ప్రారంభం


హర్ష టయోటా ఎక్ఛేంజ్ మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక పుంగనూరు రోడ్డులో ఏర్పాటు చేసిన హర్ష టయోటా ఎక్ఛేంజ్ మేళా, గ్రామీణ మహోత్సవాన్ని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. టయోటా గ్రూప్ జీఎం సాయిబాబా ముఖేష్, శివకోటి మాట్లాడుతూ మూడు రోజుల పాటు అనగా 10, 11,12 తేదీల్లో ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాత కార్లను ఎక్ఛేంజ్ చేసుకుని కొత్తకార్లను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఇందులో సర్వీస్ కూడా ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు


బర్మావీధిలో షిరిడీ సాయిబాబా

మదనపల్లె అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బసినికొండ బైపాస్ రోడ్డులోని దక్షిణామూర్తి, సాయిబాబా ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఎమ్మెల్యే బర్మావీధిలోని షిర్డిసాయిబాబాను, బైపాస్‌రోడ్డులోని సాయినాథున్ని దర్శించుకున్నారు. ఆలయాల్లో నిర్వహకులు భక్తులకు అన్నదానం చేశారు. మదనపల్లె మండలం, వలసపల్లె పంచాయతీ కాకరకాయలపల్లెలో గురుపౌర్ణమి సందర్భంగా అంజనేయస్వామిని విశేషంగా అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయంలో భజనలు, భక్తిపాటలు, నారాయణ సహస్ర పారాయణం చేశారు. ఆలయంలో కాకరకాయలపల్లె వెంకటరమణ, బద్దెల రాజన్న, బద్దెల చంద్రశేఖర్, బద్దెల విజయకుమార్, వాసు, బద్దెల శ్రీనివాసులు, బద్దెల లక్ష్మీపతి, బద్దెల కృష్ణమూర్తి, గ్రామస్థులు పర్యవేక్షించారు. పట్టణంలోని వరాల ఆంజనేయులు ఆలయంలో స్వామివారిని విశేషంగా అలంకరించి ఆలయకమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కోటగడ్డలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

పీలేరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమిని అత్యంత భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. గురుపౌర్ణమి సందర్భంగా గురువారం వేకువజామునే సాయిబాబాను ఆలయ పూజారులు ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీలేరు పట్టణం సహా పరిసర గ్రామాల్లోని భక్తులు బాబాను దర్శించుకున్నారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో పీలేరు పోలీసులు ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

తంబళ్లపల్లె, జూలై 12(ఆంధ్రజ్యోతి): శేష సాయి బాబా ఆలయంలో నిర్వాహకులు పి.సుధాకర్, వెంకటేష్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. అర్చకులు పరమేశ్వరప్ప శేష సాయి బాబాను పూలతో విశేషంగా అలంకరించి భక్తుల పేరిట అర్చనలు, పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు.

ధర్మపథం సమూహాలయంలో...

వాల్మీకిపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా చేసుకున్నారు. ధర్మపథం సమూహాలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం సత్యనారాయణ వ్రత వేడుకలను నిర్వహించారు. సాయంత్రం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం, కార్యసిద్ధి అభయాంజనేయ స్వామికి పౌర్ణమి వెలుగులో ఆకుపూజ, సింధూర పూజ, తోమాలసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిరిడీసాయిబాబా ఆలయం, భగవాన్ శ్రీసత్య సాయిబాబా మందిరంలో పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానాలు చేపట్టారు. అర్చకులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో...

బి.కొత్తకోట, జూలై10(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమిని నిర్వహించారు. షిర్డిసాయిబాబా ఆలయంలో బాబా విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేశారు. పట్టణం నుంచే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను అందజేశారు.


వాల్మీకిపురంలో అభయాంజనేయస్వామి

పెద్దమండ్యంలో...

పెద్దమండ్యం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలో భక్తులు గురుపౌర్ణమిని భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. పాపేపల్లి పంచాయతీ గుడిసెవారిపల్లి సమీప సాయిబాబా దేవాలయంలో సాయిబాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అర్చకులు మణకంఠస్వామి అందజేశారు. నిర్వహకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం

ఎమ్మెల్యేలు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, షాజహాన్ బాష

వాల్మీకిపురం/మదనపల్లె టౌన్/తంబళ్లపల్లె/బి.కొత్తకోట, జూలై 10(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలో అర్హులైన ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందిస్తున్నామని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన నిరుపేదల సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. చింతపర్తి గ్రామంలో ఎమ్మెల్యే నల్లారి ఇంటింటా పర్యటించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ మహిళ, నేతలు శేషాద్రిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గుర్రెడ్డి చంద్రారెడ్డి, ద్వారకనాథరెడ్డి, కేవీరెడ్డి, తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లెలో ఎమ్మెల్యే: షాజహాన్‌బాషా ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. పంచాయతీ ఇన్‌చార్జి సిమెంట్ రమణ, శశికుమార్, బెల్లెరెడ్డి ప్రసాద్, ఎమ్మార్పీఎస్ వాసు తదితరులు పాల్గొన్నారు.
- తంబళ్లపల్లెలో ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందిస్తున్నామని టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. చేలూరివాండ్లపల్లెలో టీడీపీ నేతలు, కార్యకర్తలతో కలసి ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను అందచేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీదర్ నాయుడు, పురుషోత్తం, తెలుగు యువత పార్లమెంటు ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర, బీసీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి సోముశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి బేరిశీన, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, గంగులరెడ్డి, బీఎంఆర్ రెడ్డప్ప, గ్రామాధ్యక్షులు మహేష్, రామ్మూర్తినాయుడు, శివకృష్ణ, సురేంద్ర, రెడ్డప్పనాయుడు, వికలాంగుల అధ్యక్షుడు రామాంజులు, ఆదిరెడ్డి, తరుగు శివారెడ్డి, సోము, కుక్కరాజుపల్లె మదన, లక్ష్మీనారాయణ నాయుడు, మల్లి, నరేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.
- బి.కొత్తకోటలో స్థానిక నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు డి.నారాయణ, ప్రభాకర్, చావిడికిట్టన్న, మస్తాన్, నాసిర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరిమితి మించి ప్రయాణికులను తరలించరాదు

ఆటో డ్రైవర్లతో సీఐ సత్యనారాయణ

రామసముద్రం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆటోలు, సుమోలు, తుఫాన్ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు తప్పవని సీఐ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలానికి విచ్చేసిన ఆయన పోలీస్ స్టేషన్ ముందు ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అతివేగంగా వాహనాలను నడపరాదని ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించాలన్నారు. ఆటోలో ఎక్కిన మహిళలను మర్యాదపూర్వకంగా మాట్లాడాలని ప్రతి ఆటోకు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, పరిమితికి మించి వెళ్లకూడదని హెచ్చరించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అలాగే డ్రైవర్ సీటులో ప్రయాణీకులను కూర్చోనివ్వరాదన్నారు. ఎస్‌ఐ రమేష్‌బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న ఏఎంసీ చైర్మెన్ పురం రామ్మూర్తి

పీలేరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): పీలేరు ఏఎంసీ ప్రాంగణంలో నిర్మించదలచిన అన్నా క్యాంటీన్ నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భూమి పూజ చేశారు. ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి నేతృత్వంలో స్థానిక శివాలయ ప్రధాన అర్చకులు విరూపాక్షం కుమారస్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూ.65 లక్షలతో అన్నా క్యాంటీన్ భవనాన్ని నిర్మిస్తోందన్నారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సురేంద్రారెడ్డి, ఎంపీడీఓ శివశంకర్, ఎంఈఓ పద్మావతమ్మ, ఏఎంసీ సభ్యులు రహంతుల్లా, కలప రవి, సుబ్బయ్య, ఎం.కృష్ణమూర్తి, ఎస్.శివమ్మ, రమాదేవి, ఎం.రజనీ, ఎన్.అమరనాథరెడ్డి, జి.కిశోర్ నాయుడు, టీడీపీ నేతలు కోటపల్లె బాబురెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అమరనాథరెడ్డి, కంచి సూరి, పోలిశెట్టి సురేంద్ర, షౌకత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా జనార్ధన

పెద్దమండ్యం, జూలై 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా ఎం. జనార్ధనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు తెలిపారు. గురువారం కార్యదర్శుల సంఘం ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా సి. సుబ్రమణ్యం, కోశాధికారిగా కె. బాలజీ సభ్యులు గా ఎం. శైలజ, జి. శేషాద్రి, పి. గోవర్ధన, ఎం. వరప్రసాద్ నాయక్, సి. మంజుభార్గవి, ఎస్.ఖాదర్‌బాష, ఎన్. లక్ష్మీప్రసన్న, ఎం. హరిప్రసాద్‌ను ఎన్నుకునట్లు వారు తెలిపారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

మదనపల్లె అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల జూనియర్ కళాశాల వార్షికోత్సవం గురువారం ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ బాలికలకు సౌకర్యవంతంగా ఉన్నత విద్యను అభ్యసించేందుకు బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో వృత్తి విద్య, సాంకేతిక విద్య బాలికలకు నేర్పుతున్నట్లు చెప్పారు. కళాశాలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి, అధ్యాపకుడు రెడ్డెప్పరెడ్డి, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సింగిల్ విండో అధ్యక్షుడిగా వెంకటరమణనాయుడు

కలకడ, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) అధ్యక్షుడిగా మద్దిపట్ల వెంకటరమణనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. డైరెక్టర్లుగా నడిమిచెర్ల, కోన వాసులు బి.గిరిజమ్మ, ఎం.వెంకటరమణకు అవకాశం దక్కింది.

ఎస్పీపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

పీలేరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎస్పీ విద్యాసాగర్ నాయుడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రజాసంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. మదనపల్లెలోని గౌతమ బుద్ధుడి ఘటనలో ఎస్పీ వ్యవహారశైలి అభ్యంతరకరంగా ఉందంటూ ఏఐటీయూసీ కార్యాలయంలో 'బాస్' నేతలు ముల్లంగి కృష్ణయ్య రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ఎద్దుల మహేశ్, బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలకుంట శ్రీనివాసులు, ఏపీఎంఆర్‌పీఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ ముల్లంగి చంద్రయ్య, మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ, సీపీఐ నేత టీఎల్ వెంకటేశ్, రాష్ట్ర గిరిజన సమైఖ్య జిల్లా కన్వీనర్ కిల్లా విజయ్ కుమార్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృతతేజ, ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బోదేషావలి పాల్గొన్నారు.

కార్యదర్శుల కార్యవర్గం ఏర్పాటు

నిమ్మనపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీ కార్యదర్శులు గురువారం నూతన కార్యవర్గాన్ని ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాలరాజు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటరమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా గాయత్రి, కోశాధికారిగా నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా గౌతమి, మీడియా ప్రతినిధిగా రజిత, సభ్యులుగా రాజశేఖర్, సరస్వతి, రాజేష్, తస్లీం నియమితులయ్యారు.